www.vaarthavedhikasurya.com
RNI: TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
SCAN ME
తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 17 | శనివారం | 21, జూన్ 2025 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥



## ఒడిశాలో నవశకం ప్రారంభం అయ్యింది

- ఏడాది పాలనలో ఎంతో మార్పు కనిపిస్తోంది
- రూ.18,600 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులకు ప్రారంభం
- జగన్నాధుడి కోసం ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా
- ఒడిశా పర్యటనలో ప్రధాని మోడీ

భువనేశ్వర్,జూన్ 20(వార్త వేదిక సూర్య): ఒడిశాలో మొదటిసారిగా ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం సుపరి పాలన, ప్రజా సేవలతో విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసిందని.. ఇది ఎంతో ప్రత్యేకమైన రోజని ప్రధాని మోడీ అన్నారు. ఈ వార్షికోత్సవం కేవలం ప్రభుత్వ వార్షికోత్సవం మాత్రమే కాదని.. ఇది సుపరిపాలన స్థాపన వార్షికోత్సవమని అభివర్ణించారు.

మిగతా 2లో..




## మాజీ డీజీపీ మహేందర్ రెడ్డినీ విచారిస్తారా?

- మహేందర్‌రెడ్డి చెబితేనే ట్యాపింగ్ చేశామన్న ప్రభాకర్‌రావు?
- ప్రణీత్ రావు హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేయడంలో ప్రభాకర్ రావు పాత్ర ?
- బండి సంజయ్‌కూ సిట్ పిలుపు
- వాంగ్మూలం ఇవ్వాలని సంజయ్‌కు ఫోన్
- మీ ఫోన్ ట్యాప్ అయిందని బండికి సిట్ వెల్లడి
- సమయం చూసుకుని వస్తానన్న సంజయ్?
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త మలుపు

హైదరాబాద్,జూన్ 20, (వార్త వేదిక సూర్య): దేశంలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజురోజుకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. బీజేపీ జాతీయ నాయకుల

మిగతా 2లో..



# బాబుతో చర్చలకు రెడీ

- నాలుగురోజులయినా చర్చిద్దాం
- కానీ తెలంగాణ హక్కులు వదులుకోం
- బనకచర్ల సమస్యకు ఏపీ వైఖరే కారణం
- కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకుంటే మంచిది
- రాయలసీమను రత్నాలసీమను చేస్తానన్నది కేసీఆరే
- గోదావరి జలాలు ఏపీ వాడుకుంటే తప్పేంటని కేసీఆరే ప్రశ్నించారు
- కేటీఆర్‌కు కిషన్‌రెడ్డి లైజనింగ్ ఆఫీసర్
- కేబినెట్ నిర్ణయం తర్వాతే కాళేశ్వరం కట్టారని ఎంపీ ఈటల రాజేందర్ చెబుతున్నారు
- ఏది నిజమో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాల.
- బనకచర్లపై మీడియాతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ఢిల్లీ,జూన్ 20, (వార్త వేదిక సూర్య): "గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరిపేందుకు సిద్ధం. ఎవరితోనూ వివాదాలు కోరుకోవడం లేదు. అయితే తెలంగాణ హక్కులను మాత్రం వదులుకునే ప్రసక్తే లేదు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ తొలుత తెలంగాణను సంప్రదించకుండా, నేరుగా కేంద్ర ప్రభుత్వానికి పీఎఫ్ఆర్ సమర్పిం చడమే ప్రస్తుత వివాదానికి మూలకారణమ "ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డిశుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే మాతో చర్చించి ఉంటే ఈ వివాదం ఉండేది కాదు. కేంద్రానికి ఏపీ నివేదిక ఇవ్వగానే, కేంద్రం కూడా అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతోంది. ఒక రోజు కాదు, అవసరమైతే నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కార మవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం అని అన్నారు. "ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు" అన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు ఇప్పటికే అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని రేవంత్గుర్తుచేశారు.

ఈ అంశంపై చర్చించేందుకు తమకు ఎలాంటి బేషజాలు లేవని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై మాట్లాడుకుందామని తెలిపారు. ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని, ఈ భేటీలో బనకచర్ల అంశంపై సమగ్రంగా చర్చించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్‌ను అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తా మని వెల్లడించారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాద పరిష్కారానికి ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. జులై 6, 7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు.

కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత బీఆర్ఎస్ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిందని విమర్శలు గుప్పించారు. "నీళ్ల, నిధుల పేరిట బీఆర్ఎస్ నేతలు మోసపూరిత సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకున్నారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కూడా గతంలో ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్ రావులే" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

అధికారం కోల్పోయిన అసహనంతోనే హరీశ్ రావువిమర్శలు చేస్తున్నారని, తెలంగాణకు అన్యాయం చేసింది కేసీఆర్, హరీశ్ రావులేనని.. కేటీఆర్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లైజనింగ్ అధికారిగా పని చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేబినెట్ నిర్ణయం తర్వాతే కాళేశ్వరం కట్టారని ఎంపీ ఈటల రాజేందర్ చెబుతున్నారని అన్నారు. ఏది నిజమో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలని సీఎం ప్రశ్నించారు. కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, అమిత్ షా గతంలో అన్నారని గుర్తుచేశారు. దీనిపై కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

తాను కృష్ణా జలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్ఓసీ అడిగితే మాజీ

మిగతా 2లో..

## బనకచర్లపై బాబుతో ముందే లోపాయికారి ఒప్పందం

- రేవంత్ రెడ్డి 500 టీఎంసీ లతో సరిపెట్టాలనుకోవడం తెలంగాణ ను నిండా ముంచడమే
- ఇది చంద్రబాబుకు గురుదక్షిణగా భావించాలా ?
- అడ్ హాక్ అగ్రిమెంట్‌కు ఫైనల్ అవార్డుకు తెలియని రేవంత్ రెడ్డి
- సీఎం రేవంత్ వ్యాఖ్యల పట్ల మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం



హైదరాబాద్,జూన్ 20, (వార్త వేదిక సూర్య): బనకచర్ల అసలు భాగోతం ఢిల్లీలో సీఎం రేవంత్ మాటల ద్వారా బయటపడ్డది. బనక చర్లపై చంద్రబాబు నాయుడుతో ముందే లోపాయి కారి ఒప్పందం కుదుర్చుకుని గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు ఇస్తేచాలనే పల్లవిని వినిపిస్తూ తెలంగాణకు తీరని ద్రోహం తల పెట్టేందుకు

మిగతా 2లో..

## రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కొనసాగింపు

### 23వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ

హైదరాబాద్,జూన్ 20(వార్త వేదిక సూర్య): సింగరేణి కాలరీస్ సామా జిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బల రామ్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 23వ తేదీ నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు

మిగతా 2లో..






## అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

- సామాజిక న్యాయం పునాదిపై ఆర్థిక అభివృద్ధి.. కాంగ్రెస్ సిద్ధాంతం
- పెట్టుబడులకు సరైన వేదిక హైదరాబాద్
- అసోచామ్ సదరన్ కౌన్సిల్ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్,జూన్ 20, (వార్త వేదిక సూర్య):ఆర్థిక అభివృద్ధితో పాటు మాన వీయ కోణాన్ని జోడిస్తూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధికిఓ కొత్త నిర్వచనాన్ని రచిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాదులోని the westin, mindspaceలో అసోచామ్ సదరన్ CSR &sustainability కౌన్సిల్ సదస్సు, అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యత లతో కూడిన తెలంగాణను నిర్మించేందుకు యావత్ క్యాబినెట్ కట్టుబడి

మిగతా 2లో..

## వ్యవసాయరంగంలో ఏఐ సాంకేతికత

- రోజువారీ సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల
- ఈ రోజు మరో రెండు సంస్థలతో చర్చలు
- సాగులో ఉన్న భూమి, పంటల వారి విస్తీర్ణము మరియు ముందుగానే పంట చీడల గుర్తింపు, నివారణలో ఏఐ పరిజానాన్ని వాడుకొనే యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్,జూన్ 20, (వార్త వేదిక సూర్య): వ్యవసాయ రంగంలో ఏఐ సాంకేతి కతను వాడుకునే దిశలో భాగంగా వివిధ ఏఐ సంస్థల ప్రతినిధులతో గత రెండు, మూడు రోజులుగా వ్యవ సాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమి, సీజన్ల వారిగా పంటల విస్తీర్ణము, పంట చీడ పీడల



గుర్తింపులో మనుషుల వాడకాన్ని తగ్గించి ఏఐ సాంకేతికత వాడాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని, తద్వారా రైతాంగానికి

మిగతా 2లో..



## యోగ సర్వరోగ నివారిణి

- ఎల్బీ స్టేడియంలోని యోగ కౌంట్ డౌన్ మహోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 20, (వార్త వేదిక సూర్య): నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎల్బీ స్టేడియంలో 24 గంటల ముందు కౌంట్ డౌన్ మహోత్సవం ప్రారంభమైంది. ఈ వేడుకల్లో ప్రముఖ యోగా సంస్థలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు భాగస్వామ్యం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రముఖ నటినటులు సాయిధరమ్‌తేజ్ ఖుష్బూ, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు.

మిగతా 2లో..

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్-బీఆర్ఎస్ నాటకాలు!

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపణ

హైదరాబాద్, జూన్ 20, (వార్త వేదిక సూర్య): తెలంగాణ రాష్ట్రంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ అంశాలను తెరపైకి తీసుకొస్తోంది. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలి. రాష్ట్రంలో



ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా భయంకరమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మిగతా 2లో..

# బాబుతో చర్చలకు రెడీ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పసలేదని, 2023లో కేంద్రానికి హరీశ్ రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని రేవంత్ గుర్తుచేశారు. "విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. దీనిపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. గోదావరిలో 968 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కానీ కేటాయించిన నీటిని వాడుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదాలు తలెత్తుతున్నాయి" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# వ్యవసాయరంగంలో ఏఐ సాంకేతికత

మొదటి పేజీ తరువాయి..

సత్వర సేవలందించడానికి అవకాశాలు ఏర్పడుతాయని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రోజు జరిగిన సమీక్ష సమావేశంలో ఈ దిశగా ప్రొ.జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయము వారు గత మూడు సంవత్సరాల నుండి చేస్తున్న పరిశోధనల ఫలితాలను ఆగ్రోనమి ప్రొ. డా. నీలిమ, మంత్రి తుమ్మలకు తెలియజేశారు. ఇక్రిశాట్ నుండి హాజరైన ప్రతినిధులు తాము ప్రయోగిస్తున్న ఉపగ్రహ చాయాచిత్రాల వివరాలు, దాని ఆధారంగా వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న సేవలను ముఖ్యంగా పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయడంలో తాము అవలంబిస్తున్న పద్ధతులను తెలియ జేశారు. అగ్రివాస్ ప్రతినిధులు తాము ఉపయోగిస్తున్న ఉపగ్రహ చాయా చిత్రాలు, వాటి ద్వారా పంటలకు వచ్చే తెగుళ్లు, క్రిమికీటకాలు మరియు నీటి ఎద్దడి పరిస్థితులను ఎలా అంచనా వేయగలుగుతున్నాము, తమ పరిశోధనల ఫలితంగా రైతులు ఏ విధంగా ప్రయోజనం పొందిన విషయాలను తెలియచేశారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సూచనలతో వ్యవ సాయ రంగంలో కూడా ఏఐ సాంకేతికత ఉపయోగించుకొని, రైతులకు ప్రభుత్వం ద్వారా అందే సేవలను మరింత సమర్ధవంతంగా అమలు చేయుటకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని తెలిపారు. ఈ వానాకాలం నుండి పైలట్ పద్ధతిలో అందుబాటులో ఉన్న అన్ని రకాల టెక్నాలజీని వాడుకొని, అన్నింటికంటే రైతులకు ప్రయోజనకరంగా ఉన్న పద్ధతులను రాష్ట్రమంతటా విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉన్నదని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ సెక్రటరి రఘునందన్ రావు, వ్యవసాయ అధికారులు, యూని వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో

# కాంగ్రెస్-బీఆర్ఎస్ నాటకాలు!

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. ఈ మేరకు ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల వర్క్ షాప్ లో మాట్లాడారు. బిజెపి ఆఫీసులో పనిచేసే సిబ్బంది, నాయకులు, సోషల్ మీడియా టీమ్ ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. జడ్జిలు, వ్యాపారస్తులు, సినీనటులు, ప్రతిపక్ష నాయకులు, ఎన్నికైన ప్రజాప్రతినిధుల ఫోన్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ట్యాపింగ్ చేశారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కాంగ్రెస్-బీఆర్ఎస్ నాటకాలాడుతున్నాయి. ఈ రెండు పార్టీలు బిజెపి ని అడ్డుకునేలా కుట్రలు చేస్తున్నాయి. ఈ విషయంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే మరోలా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అవినీతి, అక్రమాలను.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీలను నెరవేర్చకుండా వైఫల్యం చెందిన విషయాలను ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. మండల కమిటీలు, జిల్లా కమిటీల నుంచి వచ్చిన నూతన నాయకత్వం రానున్న రోజుల్లో ఉద్యమాలతో పోరాటాలకు సిద్ధం కావాలి.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం రావాలి. నరేంద్ర మోదీ నాయకత్వంలోనే తెలంగాణను రక్షించుకోగల్గుతాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రాష్ట్రానికి ఒక్క రూపాయి అప్పుపుట్టడం లేదంటూ మాట్లాడుతున్నారు.. ఇది గత బీఆర్ఎస్, ప్రస్తుత ప్రభుత్వం పాపమే. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల చేతగానితనం, అసమర్థత కారణంగానే తెలంగాణ రాష్ట్రం అప్పులపాలైంది. పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించలేని పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు.

## ఒడిశాలో నవశకం

# ప్రారంభం అయ్యింది

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదిలో ప్రజలకు సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి మోహన్ మాఝి, ఆయన మొత్తం బృందాన్ని అభినందిస్తున్నానని అన్నారు. కాగా, 2024 జూన్ లో జరిగిన ఒడిషా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీని మట్టికరిపించి.. ఒడిషా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అక్కడ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో సామాజిక ఆర్థిక అభివృద్ధి విషయంలో నవశకం ప్రారంభమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బిహార్ నుంచి ఒడిశా పర్యటనకు వెళ్లిన ఆయన.. రూ.18,600 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని మాట్లాడారు. సుపరిపాలన, ప్రజాసేవలో ఒడిశాలోని భాజపా ప్రభుత్వం విజయవంతంగా ఒక ఏడాది పూర్తి చేసుకుందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని ప్రధాని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. 'జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేశారు. వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారు. విందులో పాల్గొని చర్చించుకుందామని పిలిచారు. జగన్నాథుడి పుణ్యభూమికి వెళ్లడం నాకు ముఖ్యమని చెప్పా. ఆయన ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించా'అని చెప్పారు. పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారాన్ని తెరవాలన్న ప్రజల డిమాండ్‌ను భాజపా ప్రభుత్వం నెరవేర్చిందని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌లో సుపరిపాలనకు చోటు లేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఒడిశా అవినీతి కేంద్రంగా నిలిచిందన్న ప్రధాని.. మౌలిక సదుపాయాల కల్పనలో అప్పటి ప్రభుత్వం విఫలమైందన్నారు. చాలా ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని, క్రమంగా వాటిని అభివృద్ధి చేసేందుకు భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా రూ.18,600 కోట్ల విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. 'ఒడిశా విజన్ డాక్యుమెంట్'ను ఆవిష్కరించారు. అలాగే పలు కొత్త రైళ్లను ప్రారంభించారు. ఒడిశా పర్యటన అనంతరం.. ప్రధాని విశాఖకు రానున్నారు. రాత్రి అక్కడే బస చేసి, శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లో నిర్వహించబోయే యోగా కార్యక్రమంలో పాల్గొననున్నారు.


## ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం: నాయిని

**వరంగల్,జూన్ 20(వార్త వేదిక సూర్య):** సీనియర్ నేతగా ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం అని ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి తెలిపారు. కొండా మురళి వ్యాఖ్యలపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తాం అని అన్నారు. ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా ఈ విషయంపై అధిష్టానం ఆలోచన చేయాలని చెప్పారు. ఎవరైనా సరే పార్టీ లైన్ దాటి మాట్లాడొద్దు అని హెచ్చరించారు. లోకల్ బాడీ ఎన్నికల సమయంలో ఇలా మాట్లాడటం సరికాదని విమర్శించారు. మీ పాపాలు కులాన్ని అడ్డుపెట్టుకుంటే పోతాయా? అని నాయని రాజేందర్ రెడ్డి ప్రశ్నించారు.

## మరోమారు సిట్ కార్యాలయానికి ప్రభాకర్ రావు

### సుదీర్ఘంగా విచారించిన అధికారులు

**హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును శుక్రవారం కూడా సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లోని సిట్ కార్యాలయంలో 8 గంటలకు పైగా ప్రశ్నించారు. ఇప్పటికే ఈనెల 9, 11, 14, 19 తేదీల్లో విచారించిన సిట్ అధికారులు .. శుక్రవారం నిందితులు.. సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా



ప్రశ్నించినట్టు సమాచారం. విచారణలో ప్రభాకర్‌రావు సిట్‌కు పూర్తిగా సహకరించలేదని సమాచారం. కీలకమైన ప్రశ్నలకు సమాధానాలు దాటవేసినట్టు తెలుస్తోంది. దర్యాప్తునకు ప్రభాకర్‌రావు సహకరించడం లేదని సిట్ అధికారులు కోర్టుకు తెలిపే అవకాశముంది.

# బనకచర్లపై బాబుతో ముందే లోపాయికారి ఒప్పందం

మొదటి పేజీ తరువాయి..

సిద్ధమయ్యారని ఆయన మాటలు చెప్పకనే చెబుతున్నాయి.

కేబినెట్ సమావేశం ఏర్పాటు, చంద్రబాబుతో చర్చల ప్రతిపాదన ముందే కుదుర్చుకున్న మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమేనని స్పష్టమైంది. కేసీఆర్ గోదావరి లో తెలంగాణ కు ఇప్పటికే ఇచ్చిన జీవో ల ఆధారం గా 968 టీఎంసీ ల హక్కు కు తోడు సముద్రంలో కలుస్తున్న 3 వేల టీఎంసీలలో 1950 టీఎంసీల జలాలు తెలంగాణ కు ఇవ్వాలని కోరారు.

అంటే మొత్తం 2918 టీఎంసీలు కేసీఆర్ అడిగితే రేవంత్ రెడ్డి వెయ్యి టీఎంసీ లకు మన వాటా పరిమితం చేసే కుట్ర చేస్తున్నారు. కేసీఆర్ కృష్ణా జలాల్లో 763 టీఎంసీల వాటా కోసం ట్రిబ్యునల్ ముందు పోరాడితే రేవంత్ రెడ్డి 500 టీఎంసీలతో సరిపెట్టాలనుకోవడం తెలంగాణను నిండా ముంచడమే. అపెక్స్ కౌన్సిల్ కు డిమాండ్ చేయకపోవడం ,చంద్రబాబు తో చర్చలు చేస్తామనడం వెనక మతలబు ఏమిటో .ఇది చంద్రబాబు కు గురుదక్షిణ గా భావించాలా ?

అపెక్స్ కౌన్సిల్‌లో కేసీఆర్ బనకచర్ల కు ఒప్పుకున్నారనే విధంగా దుష్ప్రచారం చేస్తున్న తీరును, ఇప్పటికే పూర్తి ఆధారాలతో ఎండగట్టా. మరో సారి కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్ లో చేసిన వాదన కాపీ ని ఇక్కడ జత పరుస్తున్నా. కృష్ణా జలాల్లో 299 టీఎంసీ లకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పుకున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి అదే పనిగా చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా .

కేసీఆర్ సెక్షన్ 3 ప్రకారం కొత్త టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ తో కృష్ణా ట్రిబ్యునల్ ను సాధించి పెట్టారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు 763 టీఎంసీ లు తెలంగాణ కు కేటాయించాలని అఫిడవిట్ వేశాం. మన న్యాయవాదులు ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తున్నారు .రేపో మాపో మనం కోరిన విధంగా 763 టీఎంసీ ల వాటా సాధించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి .

సమైక్య రాష్ట్రం లో కాంగ్రెస్ ,టీడీపీ ల పాలనలో తెలంగాణ లో కృష్ణా నదిపై 299 టీఎంసీ ల మేరకే నిర్మిస్తున్న ప్రాజెక్టులు ఉండటం తో అంతే వాటా మనకు పరిమితమైంది . ట్రిబ్యునల్ ఫైనల్ అవార్డు వచ్చే వరకు 299 టీఎంసీ లు సరిపోవనీ, ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన మొత్తం 811 టీఎంసీల కృష్ణా జలాల్లో సగం అంటే 405 టీఎంసీ లు తాత్కాలికంగా కేటాయించాలని డిమాండ్ చేశా. అడ్ హాక్ అగ్రిమెంట్ కు ఫైనల్ అవార్డుకు తెలియని సీఎం రేవంత్ రెడ్డి అజ్ఞానానికి , అవగాహనా రాహిత్యానికి చింతిస్తున్నా.

# అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

పని చేస్తుంది అన్నారు.

మనం ఇప్పుడు అపార వనరులు ఉన్నా కానీ అసమానతలు ఉన్న ప్రపంచంలో జీవిస్తున్నాం అన్నారు. ' ' ట్రికిల్ డౌన్' ఆర్థిక వ్యవస్థలు పనిచేయలేవని స్పష్టం అయ్యింది, ఇప్పుడు కేవలం ' లిఫ్ట్ ఆల్' అందరినీ అభివృద్ధి చేయాలన్నది అనివార్యం అన్నారు.

ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం పునాదిపై నిలవాలని కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఆసిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తుంది అన్నారు. పారిశ్రామిక వేత్తల చర్యలు దానం కోసం కాకుండా బాధ్యత కోసం కావాలి, మీ పని ప్రశంసల కోసం కాదు సామాజిక మార్పు కోసం అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మనందరి ప్రయత్నం సంస్థల నిర్మాణం కోసం మాత్రమే కాకుండా సమాజాల శ్రేయస్సు కోసం కూడా పనిచేయాలని డిప్యూటీ సీఎం ఉద్బోధించారు. కార్పొరేట్ సంస్థలు CSR (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు ఖర్చు చేసేందుకు తెలంగాణ రాష్ట్రం సరైన వేదిక అన్నారు. ఈ రాష్ట్రంలో మీరు అనుకున్న లక్ష్యాలను నూటికి నూరు శాతం నెరవేర్చడమే కాదు, ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేసేందుకు అవకాశం ఉందని దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో CSR నిధులు ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనువైన ప్రాంతం అన్నారు.

ఇక్కడ అనుకూలమైన అందరికీ సరిపోయే వాతావరణం, భాషా సమస్య లేదు, శాంతిభద్రతలు, తక్కువ ధరకు పుష్కలంగా లభించే మానవ వనరులు, అన్నిటికీ మించి ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఇక్కడ ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలోని రాష్ట్రాలతో కాదు. అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతుంది అన్నారు. హెల్త్, ఫార్మా, ఐటీ, ఫుడ్ గ్రెన్స్ వంటి రంగాల్లో తెలంగాణ ది తిరుగులేని ప్రస్థానం అన్నారు.

ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో పేద విద్యార్థులకు విద్యను అందించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అని తెలిపారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల క్యాంపస్లో, ఒక్కో పాఠశాలను 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం అన్నారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున 100 పాఠశాలలు మంజూరు చేసాం అన్నారు. స్కూల్స్ నిర్మించడం కాదు వాటిని నిర్వహించడమే సమస్య అని ఓ మిత్రుడు సూచించారు. ఈ నేపథ్యంలో నిర్వాణ కోసం కార్పొరేట్ కంపెనీలను సంప్రదించగా గొప్ప స్పందన కనిపించింది ఆ పాఠశాలలన్నిటిని నిర్వహిం చేందుకు సిద్ధంగా ఉన్నామని కార్పొరేట్ కంపెనీలు 15 రోజుల వ్యవధిలోనే హామీ ఇవ్వడం గమనార్హం అన్నారు.

గతంలో నిర్మించిన 100 ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నాం, ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చాయని డిప్యూటీ సీఎం తెలిపారు.

CSR అంటే లాభాల్లో రెండు శాతం ప్రజాహిత కార్యక్రమాలకు కేటాయించడానికి చట్టపరమైన బాధ్యతగా చూస్తాం, కానీ నేను ఒక భిన్నమైన దృష్టి కొనాన్ని సమావేశానికి హాజరైన వారితో పంచుకోవాలని కోరుకుంటున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. సమాజాన్ని పరిగణలోకి తీసుకోని అభివృద్ధి సరైనది కాదు, ప్రయోజనం లేని లాభం శూన్యమే అన్నారు.

సుస్థిరత అనేది పర్యావరణానికి మాత్రమే పరిమితం కాదు అది మానవ గౌరవాన్ని కూడా కలిగి ఉండాలన్నారు, అభివృద్ధి ఫలితాలు కేవలం కార్పొరేట్ ఆఫీసులకే పరిమితం కాకూడదు అవి ప్రభుత్వ పాఠశాలలోనిబాలికలకు, ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, అంతరించి పోతున్న గ్రామీణ కళాకారులకు చేరాలి అన్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలను మేము ప్రభుత్వానికి విరాళాలు ఇచ్చే సంస్థలు గా కాకుండా భాగస్వాములుగా చూస్తున్నాం అన్నారు. పల్లెల్లో యువతకు గ్రీన్ స్కిల్స్‌లో శిక్షణ, మహిళా సంఘాలకు కేవలం నిధులు మాత్రమే కాకుండా యంత్రాలు, శిక్షణ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలని ఒకేసారి నిధులు కేటాయించడం కాదు దీర్ఘకాలిక అభివృద్ధికి మార్గదర్శకులుగా మారుద్దాం అని డిప్యూటీ సీఎం అన్నారు.

మీరు పని చేసే ప్రాంతాల్లో ప్రజల జీవన అనుభవాలను తెలుసు కోవాలని, స్థానిక ప్రజా సంస్థలతో కలిసి పని చేయాలని సూచించారు. నిర్మించిన భవనాలు పాతవి అవుతాయి కానీ ప్రజల నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వం వంటి అంశాలు నిరంతరం ప్రభావాన్ని చూపుతాయి అన్నారు.

ప్రతి CSR పథకం ప్రజలు తమ కాళ్ళ మీద నిలబడేలా చేయాలి, చేతులు చాచేలా కాదు, స్వరాజ్య స్ఫూర్తితో స్వయం విశ్వాసంతో నడవాలి అని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, నిర్వాహకులు సురేష్ చుక్కపల్లి, బారుల్ ఇస్లాం, అభిషేక రంజన్, కృష్ణ ఏదుల తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డీజీపీ మహేందర్ రెడ్డినీ

# విచారిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్లను కూడా నాటి కేసీఆర్ సర్కారు ట్యాపింగ్ చేసిందని, సిట్ విచారణలో వెల్లడయిన నే పథ్యంలో.. ఇప్పటి హోం శాఖ సహాయమంత్రి, నాటి ఎంపి బండి సంజయ్ ఫోన్లు కూటా ట్యాపింగ్ అయినట్లు సిట్ గుర్తించింది.

ఆ మేరకు ఆ సమాచారాన్ని బండి సంజయ్‌కు తెలిపి, ఆయన వాంగ్మూలం తీసుకునేందుకు సమయం ఇవ్వాలంటూ సిట్ అధికారులు ఆయనకు ఫోన్ చేయడంతో ఫోన్ ట్యాపింగ్ కథ కొత్త మలుపు తిరిగి నట్టయింది. అయితే తగిన సమయం చూసుకుని విచారణకు వస్తానని, సంజయ్ వారికి చెప్పినట్లు తెలుస్తోంది. నిజానికి కేసీఆర్ సర్కారు తన కుటుంబసభ్యులు, తన సిబ్బంది ఫోన్లు కూడా ట్యాపింగ్ చేస్తోందని నాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న సంజయ్ ఆరోపణలు చేశారు. ఇప్పుడు సిట్ స్వయంగా ఆయననే పిలిచి, వాంగ్మూలం ఇవ్వాలని కోరడంతో, బీఆర్ఎస్‌కు చిక్కులు తప్పకపోవచ్చంటున్నారు.

ఇదే కేసుకు సంబంధించి కీలక నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు సైతం.. నాటి డిజిపి మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకే తాము ట్యాపింగ్ చేశామని, సిట్ అధికారుల ముందు వెల్లడించినట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిని కూడా విచారించడం అనివార్యమంటున్నారు.

తాజాగా మరో అంశం తెరపైకి వచ్చింది. 2023 నవంబర్‌లో ట్యాప్ చేసిన సమాచారం తప్ప.. మిగిలిన డేటాను మొత్తం ధ్వంసం చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. దీంతో 2023 నవంబర్‌లో ట్యాపింగ్‌కు గురైన నెంబర్లు ఉన్న వారిని మాత్రమే సిట్ అధికారులు విచారణకు పిలుస్తున్నారు. బాధితులుగా ఉన్న రాజకీయ నేతల వాంగ్మూలాలు నమోదు చేసి సాక్షిగా పెడుతున్నారు దర్యాప్తు అధికారులు. ఇదిలా ఉండగా.. తనను నియమించిన మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఆదేశాలతోనే పని చేశానని ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

కాగా.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఐదో రోజు సిట్ ముందు విచారణకు హాజరయ్యారు ప్రభాకర్ రావు. విచారణలో ప్రభాకర్ రావును ప్రశ్నిస్తూ ఆయన స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేస్తున్నారు. అయితే ప్రభాకర్ రావు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని సిట్ అధికారులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు ఐదు రోజులు, గంటల పాటు విచారణ జరిపినప్పటికీ చాలా ప్రశ్నలకు తనకు తెలియదు, గుర్తు లేదనే సమాధానం ఇచ్చినట్లు సమాచారం. సుప్రీంకోర్టులో రిలీఫ్ ఉండడం వల్లనే సిట్ విచారణకు ప్రభాకర్ రావు సహకరించడం లేదని పోలీసులు చెబుతున్నారు. దీంతో సుప్రీంకోర్టులో ఉన్న రిలీఫ్‌పై ఆగస్టు 4న కౌంటర్ దాఖలు చేయాలని సిట్ నిర్ణయించింది.

పోలీస్ ఆఫీసర్ కావడంతో సిట్ అడిగిన ప్రశ్నలకు ప్రభాకర్ రావు చాలా తెలివిగా సమాధానాలు చెపుతున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అప్పటి ఇంటలిజెన్స్ చీఫ్‌గా ఉన్న అధికారి, ప్రిన్సిపల్ సెక్రెటరీలను కూడా సిట్ విచారణ జరిపి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. అప్పటి ప్రభుత్వ పెద్దలు ఎవరూ తనకు తెలియదని.. అప్పటి డీజీపీ ఆదేశిస్తేనే ఫోన్‌ట్యాప్ చేసినట్లు చెబుతున్నారు ప్రభాకర్ రావు.

ఈ క్రమంలో మాజీ డీజీపీని కూడా త్వరలో విచారించి.. స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రణీత్ రావు హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేయడంలో ప్రభాకర్ రావు పాత్ర ఉన్నట్లు ఆధారాలు సిట్ సేకరించింది .

# యోగ సర్వరోగ నివారిణి

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన అద్భుత బహుమతి యోగ. ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాలు, ఆ దేశాధినేతలు, ఆ దేశాల ప్రభుత్వాల ఆధ్వర్యంలో యోగను గుర్తించి, ఆచరిస్తున్నారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన అంశం. ప్రధాని నరేంద్ర మోదీ యోగను ప్రపంచానికి పరిచయం చేసినందుకు తెలంగాణ గడ్డ నుంచి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. నేడు తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రాంతాల్లో వేడుకలు జరుపుకోవాలి.శుక్రవారం నుంచి 24 గంటల కౌంట్ డౌన్ వేడుకలను ఎల్బీ స్టేడియంలో నిర్వహించు కుంటున్నాం. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెలుగు నేల విశాఖపట్నంలో 5 లక్షల మందితో కలిసి యోగలో పాల్గొనడం సంతోషకరం. తెలుగు ప్రజలు గర్వించాల్సిన విషయం. యోగ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి. యోగ ద్వారా మానసికంగా, శారీరకంగా బాగుంటే మన ఆరోగ్యం బాగుంటుంది.. మన కుటుంబం, సమాజం, ప్రపంచం బాగుంటుంది. యోగనే మనకు ప్రథమ డాక్టర్. యోగ సర్వరోగ



నివారిణి. యోగా పాటించినట్టయితే జీవితంలో మెరుగైన ఫలితాలు వస్తాయి. యోగను ప్రతిఒక్కరూ ఆచరించాలని కోరుతున్నాను.

## దుబ్బాకలో రూ.200 కోట్లతో

# ఇంటిగ్రేటెడ్ స్కూల్

### మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వివేక్ వెల్లడి

### ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి

**సిద్దిపేట,జూన్ 20(వార్త వేదిక సూర్య):** దుబ్బాకలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తామని మంత్రి వివేక్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వివేక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..12 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తోందన్నారు. ప్రజలందరూ ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు స్వేచ్ఛనిచ్చామని చెప్పారు. ప్రజలకు మేలు చేయాలనదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వంటి ఎన్నో మంచి పనులు చేసిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని అన్నారు. రైతులందరికి పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందిస్తున్నామని, సన్న వడ్లు పండించిన వారికి రూ.500 బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలు కూడా సన్న బియ్యం తినాలనే సదుద్దేశంతో రేషన్ ద్వారా పేదలకు సన్న



బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు అన్ని స్కీములు అమలు చేస్తామన్నారు. త్వరలోనే రాజీవ్ యువ వికాసం పథకం కూడా ప్రారంభమవుతోందని చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ప్రజలు, అధికారులకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు.

## రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం

# కొనసాగింపు

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విడుదలై సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన సింగరేణి కార్మికుల పిల్లలకు కూడా రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించనున్నట్లు వెల్లడించారు.దేశంలోనే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచనతో సింగరేణి సామాజిక బాధ్యత నిధులతో గత ఏడాది ప్రారంభించిన ఈ పథకం మంచి ఫలితాన్ని ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది 140 మంది ప్రిలిమ్స్ పాసైన వారికి సాయం అందించగా 20 మంది మెయిన్స్ లోనూ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి మరో లక్ష రూపాయల సాయం కూడా అందించామని, వారిలో ఏడుగురు సివిల్స్ లో సత్తా చాటారని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో ఈ ఏడాది కూడా మరింత మందికి ప్రోత్సాహం అందించేందుకు దీన్ని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.అభ్యర్థులు సింగరేణి వెబ్ సైట్ ను సందర్శించి ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సివిల్స్ మెయిన్స్ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.






## శ్రీనివాస్ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల

**సికింద్రాబాద్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** శ్రీనివాస్ నగర్‌లో రోడ్డుకు అడ్డంగా పొడవైన చెట్టు కొమ్మలని అడ్డుగా ఉందని స్థానికులు కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె హార్టికల్చర్ శాఖ సమన్వయంతో చెట్టు కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు అనంతరం స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు శైలెందర్, రవీందర్ సాగర్,భాస్కర్,స్థానికులు తదితరులు పాల్గొన్నారు

## గణేష్ నగర్ మండల పరిషత్ పాఠశాలలో 'జ్ఞాన రథం'

### విద్యార్థులకు ఉచిత నోట్స్ పుస్తకాలు పంపిణీ

**మైలర్‌దేవ్‌పల్లి, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
రాజేంద్రనగర్ సర్కిల్, మైలర్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని గణేష్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నోట్స్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమాదేవి అధ్యక్షతన జరిగింది . ఈ కార్యక్రమానికి స్థానిక ప్రతినిధులు రాజు గౌడ్, బాస శ్రీనివాస్,





పులిజాల వివేక్, గట్టయ్య హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా రాజు గౌడ్ మాట్లాడుతూ.... ప్రతి విద్యార్థి చదువులో ముందుకు సాగాలన్నదే తమ ఆశయమని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందజేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీతో విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గి, వారిలో చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న స్థానిక నాయకులు రాజు గౌడ్, బాస శ్రీనివాస్, పులిజాల వివేక్, గట్టయ్యలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి సహాయ సహకారాలు పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సుధా, రోహిణి, సంతోషి సరోజ, రాజశేఖర్ గౌడ్, శరత్ పాల్గొన్నారు.

## ఆదర్శ సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అదనపు అంతస్తు భవనం ప్రారంభోత్సవం

### - ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**ఎల్ బి నగర్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆదర్శ సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అదనపు అంతస్తు భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా




ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటీజన్లు మాట్లాడుతూ మీ యొక్క చొరవతో అదనపు అంతస్తు నిర్మాణం చేపట్టుకొవడం జరిగింది అని తెలిపారు. మహిళల కోసం మరో అంతస్తు నిర్మించి దానికి లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తప్పకుండా మహిళల కోసం మరో అదనపు అంతస్తు లిఫ్ట్ సౌకర్యం ఎర్పాటు చేసి నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్ యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, సీనియర్ సిటీజన్ అధ్యక్షులు వీరరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి బ్రహ్మారెడ్డి, గౌరవ అధ్యక్షులు రాంరెడ్డి, సలహాదారులు సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జులై 7 ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

**మహేశ్వరం, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
మహేశ్వరం మండలం మాన్సన్ పల్లి గ్రామంలో మహాజన నేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా జులై 7 ఎంఆర్పిఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పండగ వాతావరణంలా గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించడం కోసం మాన్సన్ పల్లి గ్రామంలో మాదిగల చైతన్య సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండల ఇంచార్జ్ బక్కని రవి మాదిగ, ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించడం జరిగింది.ఎమ్మార్పీఎస్ ఉద్యమ చరిత్రను, కమిటీ అవశ్యకతను, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, మాదిగల కర్తవ్యాన్ని వివరిస్తూ జులై 7న గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణం చేసుకొని ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని, అన్ని కులాల ప్రజల్ని ఆహ్వానించి పండగ వాతావరణంలా ఘనంగా జరపాలని తెలుపుతూ జాతి ప్రజల్ని చైతన్యం చేయడం జరిగింది. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా సాధించినటువంటి లక్ష్యాలు అనగా వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళల పెన్షన్స్ వికలాంగుల పెన్షన్స్ ఉద్యోగాలలో రిజర్వేషన్లు రేషన్ బియ్యం కోట పెంపు ఆరోగ్యశ్రీ సాధించిన ఘనత సమాజంలో వెనుకబాటుతనానికి గురైన ప్రతి కులం వెనుక నిలిచినటువంటి ఏకైక నాయకుడు మందకృష్ణ మాదిగ గారిని కొనియాడారు మాదిగలనే చెప్పుకోవడానికే ఆలోచించినా జాతిని దేశ అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ వరించడం జాతి లక్ష్యాన్ని మాదిగల మీద ప్రభుత్వాలకు ఉన్న ప్రేమను తెలియజేసిందని , మందకృష్ణ మాదిగ గారితో పాటు



యావత్ మాదిగ జాతికి దక్కిన గౌరవం అని కొనియాడారు..... భవిష్యత్తులో మా జాతి నాయకుడు తీసుకున్న నిర్ణయాలను పూజా తప్పకుండా పాటించాలని తన ఆలోచనలకు అనుగుణంగా మాదిగ సమాజం జాతి విలువను తెలుసుకుని ఎమ్మార్పీఎస్ లో భాగస్తులు అవ్వాలని ప్రతి ఒక్కరిని కోరడం జరిగింది,నూతనంగా ఎన్నుకోబడే గ్రామ కమిటీలు పూర్తిస్థాయిలో మాదిగల సమాజం కోసం ఎమ్మార్పీఎస్ ఏ విధంగా కృషి చేసిందో అదేవిధంగా ముందు కు సాగాలని మన నాయకుడి ఆలోచనని అనుసరిస్తూ చాతిని ముందు ఉంచేలాగా కృషి చేయాలని ప్రతి ఒక్కరిని కోరడం జరిగింది మాన్సన్ పల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ

అధ్యక్షులు సంగెం యాదయ్య ఉపాధ్యక్షులు ఏర్పుల యాదయ్య ప్రధాన కార్యదర్శి ఎద్దు మహిపాల్ మాదిగ కార్యదర్శి :: ఏర్పుల కుమార్ అధికార ప్రతినిధి:ఎద్దు రామయ్య,కోశాధికారి:కొండని గణేష్,సలహాదారుడు: ఎర్ర మల్లేష్, ఏర్పుల శంకరయ్య, ఏర్పుల శ్రీశైలం, ఏర్పుల గణేష్,

ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి మండల అధ్యక్షులు ఎర్ర గణేష్ మాదిగ , ఎర్ర నవీన్ కుమార్ మాదిగ, ఏర్పుల శంకరయ్య మాదిగ, ఏర్పుల గణేష్ మాదిగ, ఏర్పుల మల్లేష్ మాదిగ, ఏర్పుల యాదయ్య మాదిగ, ఏర్పుల రాజు గ్రామ కుల పెద్దలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, రాఘవేంద్ర యాదవ్, సాం. శ్రీనివాస్ గుప్తా, రాజేష్ యాదవ్, ఎడ్లకాడి సూర్యం, భూదేవి, అరుణ రెడ్డి, మైసిరెడ్డి భగవాన్ దాస్, భాస్కర్, చిరంజీవి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

### డివిజన్ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ కుర్మ

### పాలన శూన్యం ప్రకటనలకే పరిమితమైన సీఎం రేవంత్ రెడ్డి

**మైలర్‌దేవ్‌పల్లి, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
రాష్ట్రాన్ని పాలించలేని అర్హత లేని ప్రభుత్వం అధికారంలో ఉన్నదన్న ప్రజాభిప్రాయాన్ని మనం గమనించాల్సిన అవసరం ఉందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ కురుమ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో వాగ్దానాల వర్షం కురిపించిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక ప్రజల ఆశల్ని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. దాని మూలంగా రాష్ట్ర ప్రజలు, ప్రత్యేకంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలు తీవ్ర అసంతృప్తితో తల దించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు అని అన్నారు.బీఆర్ఎస్ హయాంలో అమలైన రైతు బంధు, రైతు బీమా, నిరంతర విద్యుత్, పింఛన్లు, కేసీఆర్ కిట్, కొత్త రేషన్ కార్డుల వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ఇప్పటికీ ప్రజల హృదయంలో నిలిచిపోతున్నాయి. కేసీఆర్ నాయకత్వంలో నిర్మించిన కోటి కలల కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచాయి అని ఆయన కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ రెవెన్యూ వ్యవస్థ స్తంభించింది. అధికార యంత్రాంగం పనిచేయడం




లేదు. వర్షాకాలం ప్రారంభమైన ఈ సమయంలోనే అపరిశుభ్రత పెరిగి ప్రజలు అంటు వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోని పరిస్థితి తలెత్తింది, అని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులు బీజేపీ, కాంగ్రెస్ ప్రజా సమస్యలపై స్పందించకుండానే, రాజకీయ లబ్ధి కోసమే ప్రయత్నిస్తున్నారు. ప్రజలకంటే పార్టీ ప్రయోజనాలకే విలువ ఇస్తున్నారు అని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించినా, అది అవసరాలు, అభిప్రాయాలు లేకుండానే తీసుకున్న నిర్ణయం. దాని వల్ల కొన్ని చోట్ల మహిళల మధ్య విభేదాలు వచ్చాయి, అని రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు గుప్పించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పట్ల ప్రజల విశ్వాసం బలంగా ఉంది. తిరిగి అభివృద్ధి సాధించాలంటే మరోసారి బీఆర్ఎస్ కే మద్దతు అవసరం,అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, డివిజన్ యువజన అధ్యక్షులు రాఘవేంద్ర యాదవ్, సోమ. శ్రీనివాస్ గుప్తా, బండ రాజేష్ యాదవ్, ఎడ్లకాడి సూర్యం, భూదేవి, అరుణ రెడ్డి, మైసిరెడ్డి భగవాన్ దాస్, భాస్కర్, చిరంజీవి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# పలు సమస్యల మీద ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసిన కాలనీవాసులు

**ఎల్ బి నగర్,జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గారిచే గుంటిజంగయ్య కాలనీవాసులు ఎల్.బి.నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా పలు సమస్యల మీద కలవడం జరిగింది.

వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా శ్రీశ్రీశ్రీ విజయ దుర్గంబిక దేవాలయం ముందు డ్రైనేజీ పొంగిపొర్లుతుంది అని దానివల్ల దేవాలయంకు వచ్చే భక్తులు మరియు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని తెలిపారు.వెంటనే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సంబంధించిన వాటర్ వర్క్స్ అధికారి ఏ.ఈ. శ్రీనివాస్‌ని పిలిపించారు.

వెంటనే సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అవసరం ఉంటే అక్కడ ఉన్న డ్రైన్స్ స్థానంలో నూతన పెద్ద డ్రైన్స్ లైన్స్ వేయిస్తామని హామీ ఇచ్చారు.దానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, దానికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని అలాగే బస్తి నందు ఉన్న పలు సమస్యల మీద త్వరలో మీ యొక్క బస్తీకి విచ్చేసి మీ యొక్క సమస్యలు పరిష్కారం చేస్తామని వారన్నారు .దానికి



కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాలని కమిటీ గౌరవ అధ్యక్షులు అశోక్, అధ్యక్షులు యంజాల సుధాకర్, జనరల్ సెక్రెటరీ రమావత్ రవినాయక్, వైస్ ప్రెసిడెంట్ ముక్కపల్లి బాలకృష్ణ, సలహాదారులు గోపినాయక్, హనుమంతు, శోభమ్మ, యాదమ్మ, జాయింట్ సెక్రటరీ కత్తుల యాదగిరి, మదన్, దేవేందర్, సొంటి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యం, సంక్షేమం... ముందుండే నవ యువ యూత్ క్లబ్

- సేవా శక్తిగా వెలసిన యువత
- 20 ఏళ్ల నిరంతర సమాజ బంధం విద్యతో వెలుగు, వైద్యంతో భరోసా
- యువత మార్గదర్శిగా నిరంతర సేవకు నవ యువ క్లబ్ నిలువెత్తు సాక్ష్యం
- నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి

**మైలర్‌దేవ్‌పల్లి, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
సమాజసేవే లక్ష్యంగా 2002లో ఏర్వ కుమారస్వామి ఆధ్వర్యంలో కొంతమంది యువతతో స్థాపించబడిన నవ యువ యూత్ క్లబ్ ఇప్పటికే రెండు దశాబ్దాల కాలాన్ని పూర్తి చేసుకుని, ప్రజల మన్ననలు అందుకుంటోంది. "మానవ సేవే మాధవ సేవ" అనే మహత్తర భావనతో ఈ క్లబ్ విద్య, వైద్యం, ప్రజా సమస్యల పరిష్కారంలో విశేష పాత్ర పోషిస్తోంది. ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు వివిధ పోటీలు నిర్వహించడం, పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనలో దాతల సహకారం సమకూర్చడం, కాలనీలలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అనేక కార్యక్రమాల్లో క్లబ్ చురుకుగా ఉంది.

2002-2005 మధ్యకాలంలో క్లబ్ చేపట్టిన అనేక సేవా కార్యక్రమాలు ప్రజలలో విశేష స్పందన కలిగించాయి. కంప్యూటర్ ట్రైనింగ్ సమ్మర్ క్యాంపులు, ఆరోగ్య క్యాంపులు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కార్యక్రమాలు మైలురాళ్లుగా నిలిచాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, నర్సుల సేవలను గుర్తించి సత్కరించిన ఘనత ఈ క్లబ్‌దే. ప్రజల అభిప్రాయాలను ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో క్లబ్ యువత ముందుండటం అభినందనీయం. "ప్రజాహితం మా అభిమతం" అనే నినాదంతో ముందుకు సాగుతున్న యువతకు ప్రజల నుండి, ప్రతినిధుల నుండి ప్రశంసలు లభిస్తున్నాయి. తాజాగా నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహించే ప్రణాళికపై క్లబ్ కార్యవర్గం దృష్టి పెట్టింది. ఈ క్లబ్ సేవలను స్థానికులు విశేషంగా అభినందిస్తున్నారు. నవ యువ యూత్ క్లబ్ కార్యవర్గంలో సలహాదారులుగా భాశెట్టి వెంకటేశ్వర రావు, అధ్యక్షులుగా ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొంపల్లి జగదీష్, కార్యదర్శిగా కోట శ్యామ్, కోశాధికారిగా జక్కా నవీన్ కుమార్ మరియు ఇతర సభ్యులు సేవలందిస్తున్నారు. వీరి కృషి, అంకితభావంతో నవ యువ యూత్ క్లబ్ సమాజంలో మార్పునకు కృషి చేస్తూనే ఉంది.

## కైరలీ ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్ ఎన్జీఓ వారి

# "ట్వింకిల్ టోట్స్ ప్రీ ప్రైమరీ స్కూల్" ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
"ట్వింకిల్ టోట్స్ ప్రీ ప్రైమరీ స్కూల్" ప్రారంభోత్సవంకి ముఖ్య అతిథి శ్రీమతి సుమ కనకాల , ప్రముఖ భారతీయ టెలివిజన్ ప్రజెంటర్ , నటి మరియు నిర్మాత & సునీతా శేఖర్ యాదవ్ , కార్పొరేటర్ మౌలాలి డివిజన్ , గౌరవ అతిథి గా పాల్గొన్నారు. ఇ సుకుమారన్, ప్రెసిడెంట్ కైరలీ ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్, కల్నల్ పి సుందరేశ్వరన్ (రిటైర్డ్), సెక్రటరీ, అకడమిక్ కౌన్సిల్ చైర్మన్ పికె కృష్ణన్ ఆర్గనైజింగ్ కమిటీ వారు పాల్గొన్నారు.
కైరలీ ఎడ్యుకేషన్ సొసైటీ 1993లో స్థాపించబడిన లాభాపేక్ష లేని ఎన్జీఓ చదువు కోసం డబ్బు ఖర్చు చేయలేని పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో విద్యను అందించడం కోసం మా సంస్థ స్థాపించబడింది మరియు ఇప్పటికే నేరేడ్‌మెట్‌లో కైరలీ విద్యాభవన్‌ను నడుపుతోంది, ఇది ప్రముఖ మాంటిస్సోరి విద్యావేత్త అయిన క్రీడోతో జతకట్టబడిన ప్రీ-ప్రైమరీ స్కూల్ "ట్వింకిల్ టోట్స్"ని ప్రారంభించడం గర్వంగా ఉంది. ఏ ఎస్ రావు నగర్ లోని వెంకటేశ్వర నగర్ కాలనీలో ఉన్న ఈ పాఠశాల అన్ని వర్గాల



ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందించడానికి అంకితం చేయబడింది. విద్యారంగంపై సానుకూల ప్రభావం చూపాలని సొసైటీ లక్ష్యంగా పెట్టుకుంది మరియు ఈ లక్ష్యాన్ని సాధించడంలో "ట్వింకిల్ టోట్స్" ఒక ముఖ్యమైన అడుగు."ట్వింకిల్



టోట్స్"లో మేము కొత్త జాతీయ విద్యా విధానం (NEP)ని అమలు చేయడానికి కట్టుబడి ఉన్నాము మరియు యువ అభ్యాసకులు ఎదగడానికి మరియు అభివృద్ధి చెందడానికి ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని అందించాము. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాఠశాల ఈ ప్రాంతంలో నాణ్యమైన విద్యకు కేంద్రంగా మార్చడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

### దళితులకు ఇచ్చిన భూమిలో భూస్వాములకు దారి ఇవ్వాలన్న

# ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

### తహాశీల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా..

**మోత్కూరు,జూన్ 20 (వార్త వేదిక సూర్య):** నక్షబాటను ఆక్రమించుకొని దళితులకు ఇచ్చిన ప్రభుత్వ భూమి నుండి దారి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్న మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన కట్కూరి సత్తిరెడ్డి, మానసికంగా ఇబ్బందులు పెడుతున్న ఉదయ రాజిరెడ్డిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శుక్రవారం నాడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మోత్కూరు తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటి తహాశీల్దార్ ఉపేందర్ కి . ఈ సందర్భంగా బొల్లు యాదగిరి పాల్గొని మాట్లాడుతూ, పాలడుగు గ్రామానికి చెందిన కొంపల్లి పోషయ్య తండ్రి చెన్నయ్య సుమారు, 70 సంవత్సరాలుగా సర్వే నెంబరు 81 లోని 4 ఎకరాల పైగా భూమిని కబ్జాలో ఉంటూ, ఆ భూమిలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకొని జీవించారని దానిని గుర్తించిన అప్పటి ప్రభుత్వం పోషయ్యకు 1996లో 2 ఎకరాల 32 గుంటల భూమికి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి పాస్ బుక్కులు కూడా ఇచ్చారని అన్నారు.. పోషయ్యకు సంబంధించిన ముగ్గురు కుమారులైన శ్రీరాములు, గంగయ్య, స్వామిలకు సమానంగా పంపిణీ చేయగా ఆ భూమిని వాళ్లు సేద్యానికి పనికొచ్చే భూమిని సేద్యం చేసుకుంటు మిగతా భూమిలో తమ పశువులను మేపుకుంటున్నారని తెలిపారు.. ఆ భూమి పక్కన ఉన్న లోకసాని ఉదయరాజు రెడ్డి, కట్కూరి సత్తిరెడ్డిలకు ఈ భూమిని ఆక్రమించుకోవాలనే వక్రబుద్ధితో నక్షబాటను వదిలి దళితులకు ఇచ్చిన భూమి నుండి దారి కావాలని గత ఏడాది నుండి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, కులం పేరుతో అవమాన పరుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తీవ ఇబ్బందులు పెడుతున్న భూస్వాములను నుండి రక్షణ కల్పించి మా భూములను కాపాడాలని జిల్లా మండల స్థాయి అధికారులకు నుంచి జిల్లా ఉన్నతాధికారులకు కొంపల్లి గంగయ్య పలుమార్లు దరఖాస్తు పెట్టుకొని తన బాధను చెప్పుకుంటే దళితులైన వీరికి న్యాయం జరుగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత



కుటుంబాన్ని బెదిరిస్తూ బాట ఇవ్వాలని ఇబ్బందులు పెట్టడం వారికి ఎట్లా న్యాయమవుతుందని ప్రశ్నించారు. నక్షలో ఉన్న ప్రకారంగా బాట తీసుకోవాలని, కులం పేరుతో తిట్టి ఇబ్బందులు పెట్టిన కట్కూరి సత్తిరెడ్డి, లోకాసాని ఉదయరాజు రెడ్డిలపై చట్టపరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తయిన నేటికీ దళితులకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలు కాపాడవలసిన రెవిన్యూ అధికారులు కూడా అగ్రకుల భూసాములకే వంత పాడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు సెంటు భూమి లేక ప్రభుత్వ భూమి ఆధారంగా బతుకుతున్న గంగయ్య కుటుంబానికి అండగా ఉండవలసిన అధికారులు భూస్వాముల పక్షాన ఉంటే ఎట్లా అని ప్రశ్నించారు.. ఇప్పటికైనా గతంలో దత్తప్పగూడెం నుండి పొలాలకు వెళ్లడానికి ఉన్న పాత నక్షబాటను పునరుద్ధరించాలని, దళితుల భూములను తీసుకోవాలని చూస్తున్న అధికారుల ప్రతిపాదనను ఇప్పటికైనా విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్ నర్సు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పిట్టల చంద్రయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్, కొంపల్లి ముత్తమ్మ, కొంపల్లి బుచ్చయ్య, కొంపల్లి నర్సయ్య, ప్రవీణ్, యాదగిరి, ఎడ్ల నరేష్, గంటపాక రాం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ అప్పులను మాఫీ చేయాలి

### శాసనమండలి చైర్మన్ టి. ఎస్ డి డి.సి చైర్మన్‌లకు చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో వినతి

**మోత్కూరు,జూన్ 20 (వార్త వేదిక సూర్య):** చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ అప్పులను మాఫీ చేసి, నూతన క్యాష్ క్రెడిట్ మంజూరు ఇప్పించి చేనేత సహకార సంఘాలను సహకరించాలని శుక్రవారం నాడు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి టి.ఎస్. డి.డి.సి.చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి గార్లను హైదారాబాద్ ఆయన నివాసంలో మోత్కూరు చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షులు జెల్ది రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సహకార సంఘాలకు ఉన్న క్యాష్ క్రెడిట్ కేవలం 50 కోట్ల రూపాయల లోపు మాత్రమేనని ఈ క్యాష్ క్రెడిట్ అప్పులను మాఫీ చేసి నూతన క్యాష్ క్రెడిట్ లు మంజూరు చేస్తే, చేనేత సహకార సంఘాలు మరల పునర్వైభవం చెందుతాయని అన్నారు. టెస్కో ను పునరుద్ధరించి చేనేత సహకార సంఘాల ద్వారా వస్త్రాలు కొనుగోలు చేస్తే ,చేనేత కార్మికులకు పని కల్పించటమే కాకుండా ఉపాధి అవకాశం దొరుకుతుందని అన్నారు. తాము ఇచ్చిన వినతి పత్రాన్ని సుఖేందర్ రెడ్డి, అమిత్ రెడ్డిలు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారని రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత రాష్ట్ర నాయకులు రాపోలు నర్సింహ్మా, , సిరిపురం చేనేత సహకార సంఘం అధ్యక్షులు అప్పం రామేశ్వరం, చౌటుప్పల్ చేనేత సంఘం అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, నకిరేకల్ చేనేత సంఘం అధ్యక్షులు చిలుకూరి లక్ష్మీ నర్సయ్య, తదితరులు పాల్గోన్నారు.



# కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మోత్కూరు, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని భా.జ.పా సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వికసిత్ భరత్ సభ మోత్కూరు పట్టణ



ఇంచార్జి మల్లెపాక సాయిబాబా, పట్టణ ప్రబారి శ్రీనివాస్ గౌడ్ ,బా.జ.పా. అసెంబ్లీ కన్వీనర్ కాప రవి, కో - కన్వీనర్ కూరాకుల వెంకన్న పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు మోత్కూరు మున్సిపల్ పరిధిలోని ఇందిరా నగర్ లో పట్టణ అధ్యక్షులు చాడ మంజుల అధ్యక్షత న ఏర్పాటు చేసిన వికసిత్ భరత్ సభలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో 11సం రాలలోనే 14 స్థానం ఉన్న ఆర్థిక వ్యవస్థ 4 వ స్థానానికి వచ్చిందని, గత70 సం రాల నుండి పాకిస్థాన్ పెంచి పోషించిన ఉగ్రవాదుల స్థావారలను 30 ని:ల్లో నేలమట్టం చేసి మూడు రోజుల్లో పాకిస్థాన్ ను కాళ్ళబేరానికి తీసుకొచ్చిన ఘనత నరేంద్ర మోడీకే దక్కిందన్నారు. రక్షణ రంగం సైనికులకు బూట్లు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ఇవ్వలేని దుస్థితి నుండి 80 వేలకోట్ల రక్షణ ఉత్పత్తులు ఎగుమతి చేస్తోందని, జాతీయ రహదారుల రెండింతలు కేంద్ర ప్రభుత్వం చొరవతో అయ్యిందన్నారు. ఏ .ఐ. ఎమ్ ఎస్.హాప్పిటల్స్ 7 నుండి 14 కు పెరిగాయని, ఐ.ఐ.టీ. , ఐ.ఐ. ఎమ్ ,రెండింతలయ్యాయన్నారు. 80 కోట్లమందికి ఉచిత రేషన్ గరీబ్ కళ్యాణ్ యోజన , ఉజ్వల ఉచిత గ్యాస్, 4 కోట్ల ఆవాస్ యోజన ఇండ్లు 370 ఆర్టకల్ రద్దు ,ట్రిబుల్ తలాక్ రద్దు, చట్ట సభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు ,బిసి కులగణన నిర్ణయం, ఆత్మనిర్భర భారత్, మేకన్ ఇండియా ,స్టార్టప్ ఇండియా ద్వార ఉద్యోగలకల్పన 10లక్షల ఆరోగ్య భీమా ఆయుశ్మాన్ భారత్ ,స్వచ్ఛ భారత్ మరుగుదొడ్లు నిర్మాణం, మొక్కల పెంపకం ,పరిసరాల శుభ్రత ,సీసీ రోడ్లనిర్మాణం ,రెండు లక్షల కోట్ల తో ఎరువుల సబ్సిడీ, రెండు లక్షల కోట్ల ధాన్యం సేకరణ, పంటల ధరలు రెండింతలయ్యాయని పేర్కొన్నారు. ఫసల్ భీమా యోజన ,భూసారపరిరక్షణ, పప్పుధాన్యల అభీవృద్ధి, నూనే గింజపంటల ఆభీవృద్ధి ఇలా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ,కొణతం నాగార్జున్ రెడ్డి ,గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, తిరుమలగిరి రూరల్ అధ్యక్షులు బంగారి రాజు, పట్టణ ఉపాధ్యక్షులు,కందకూరి ప్రకాష్ ,మరాఠి విజయలక్ష్మి , పట్టణ ప్రధాన కార్యదర్శులు జినుకల దశరథ , అన్నెపుసత్యనారాణ, ,చేకూరి మల్లేశం ,తీగల శ్రీధర్ గౌడ్ ,మధు సోమేశ్వరి, వంగాల శీను ,టంగుటూరి వెంకన్న, నల్ల మాసి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులు వసూలు చేస్తే నిషేధించాలి

**-ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.ఉప్పల శాంతి కుమార్**

**మోత్కూరు,జూన్ 20 (వార్త వేదిక సూర్య):** జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలను నిషేధించాలని, అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం నాడు మోత్కూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందని, ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం ,విద్యాశాఖ వత్తాసు పలుకుతున్నాయని అన్నారు.ప్రభుత్వ గురుకులాలు, బెస్ట్ అవలేబుల్ స్కీమ్ పాఠశాలలు మూతపడుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యార్థులు ప్రభుత్వానికి విద్యార్థుల.సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఎన్నికల ముందు విద్యార్థులకు ఐదు లక్షల భరోసా కార్డు, ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్టాప్‌లు ఇంకెప్పుడు ఇస్తారని, ప్రశ్నించారు ఆర్టీసీలో విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లాలో ముఖ్యంగా మోత్కూరు మండల కేంద్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తే సీజ్ చేయాలని ఆ దమ్ము ధైర్యం విద్యాశాఖ అధికారులకు లేదన్నారు., రాష్ట్ర విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఒక్క రూపాయి ఎక్కువ ఫీజు వసూలు చేస్తే ఆ విద్యాసంస్థను నిషేధించ వలసి పోయి వారికి వత్తాసు పలకడం ఏంటని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆర్టీసీ బస్ పాస్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. రాష్ట్రంలో



విద్యా సంవత్సరం ప్రారంభం అయినా నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై సమీక్ష చేసి ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేవని, ప్రభుత్వ గురుకులాలకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు బిల్లులు చెల్లించక అందులో చదివే విద్యార్థులు ఇంటి వద్ద ఉండే పరిస్థితి ఉందని, నెలకొందన్నారు.పాఠశాల గురుకులాలు మోడల్ స్కూల్లో కేజీబీవీ లలో నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేయాలని,కోరారు. విద్యార్థులు లేరని సాకుతో ప్రభుత్వం 12ఎస్సి గురుకుల ఇంటర్ కళాశాలలను మూసివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల,కళాశాలల గుర్తింపు రద్దు చేసే విధంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో ఆ విద్యాసంస్థల ముందు ధర్నాలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్నఫీజురీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిల విడుదలపై ఇచ్చిన మాట తప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు., విద్యార్థులకు ఓట్లు లేకపోతే వారి తల్లిదండ్రులకు ఉన్నాయని వారు అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్ తీసుకున్నారని వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదన్నారు.ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులను ప్రభుత్వం పెంచే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బి కేటగిరి సీట్లను లక్షల రూపాయలకు అమ్ముతున్న కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు..ఈ కార్యక్రమంలో ఏ.ఐ. వై.ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ళ శేఖర్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వంశి , భాస్కర్, మండల కార్యదర్శి రాంపాక చందు, అనిల్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు..






# కోతుల పట్టివేతకు సహకరించిన గరికే సత్యనారాయణకు సన్మానం

**రామన్నపేట, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పట్టణ కేంద్రంలో కోతులు బెడద తీవ్రంగా ఉంది. ఈ కోతులు ఆహారం కోసం ఇళ్లమీదకి వచ్చి, వీటిని దాడిలో గాయపడిన వారు చాలామంది ఉన్నారు. కోతులు నివాసల్లోకి వచ్చి నిత్యవసర వస్తువులు, ఇతర సామాగ్రిని తీసుకెళ్తున్నాయి .చిన్నారును ,పాదాచారులను గాయపరుస్తూ స్థానికులను ఇబ్బంది పెడుతున్నాయి. కోతుల బెడదల నుంచి విముక్తి చేయడానికి గరికే ఫౌండేషన్ వ్యవస్థాపకులు గరికే సత్యనారాయణ స్పందించి కోతులను పట్టేందుకు ముందుకు వచ్చి కోతులను పట్టేందుకు ఏర్పాటు చేశారు. కోతుల పట్టివేతకు సహకరించిన గరికే సత్యనారాయణను పట్టణ ప్రజలు శుక్రవారం పూలమాల , శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు సురేందర్ రావు, బొడ్డు శంకరయ్య, మేడి శంకరయ్య, నకరికంటి మొగులయ్య ,ఎండి వహీద్ ,కొమ్ము వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆదర్శ మోత్కూరు మున్సిపాలిటీ ప్రజలు సహకరించాలి..

**మోత్కూరు, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** ఇంటి పరిసరాలను పరిశుభ్రత పాటిస్తూ జిల్లాలో స్వచ్ఛ ఆదర్శ మోత్కూరు మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి పట్టణ ప్రజలు తడి, పొడి హానికరమైన చెత్తను వేర్వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని శానిటేషన్ సూపర్వైజర్




వీరస్వామి కోరారు. శుక్రవారం నాడు మున్సిపాలిటీ పరిధిలోని 100 రోజుల కార్యచరణ భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆధ్వర్యంలో తడి, పొడి, హానికరమైన చెత్తపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆర్.పి.లు, పారిశుద్ధ్య సిబ్బంది పట్టణ ప్రజలు తదితరులు. పాల్గొన్నారు.

# ఎస్సీ/ఎస్టీ కమిషన్ చైర్మన్ సభ్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్



**భువనగిరి, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు శుక్ర,శని, రెండు రోజుల పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటిస్తారని, ఎస్సీ, ఎస్టీ ల దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలు విన్నవించి, పరిష్కారం చేసుకోవాలని సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు శనివారం ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. ఎస్సీ ఎస్టీ అత్యాచారాల కేసులు, పరిహారం, ఎస్సీ ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులు, కులాంతర వివాహం ప్రోత్సాహకాలు, మొదలగు విషయాలపై దరఖాస్తు చేసుకొని, సమస్యలు పరిష్కారం చేసుకొవాలని ఆయన కోరారు.


## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట

**తేదీ : 20/06/2025, శుక్రవారం**

**శ్రీస్వామి వారి ఆదాయము రూ: 17,13,328/-**

**శ్రీ స్వామి వారికి 720 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.**

| | | |
|---|---|---|
| కళ్యాణ కట్ట | - | 36,000/- |
| ప్రధాన బుకింగ్ | - | 96,100/- |
| కైంకర్యములు | - | 400/- |
| సుప్రభాతం. | - | 6,900/- |
| బ్రేక్ దర్శనం. | - | 1,13,400/- |
| వ్రతాలు | - | 56,800/- |
| వాహన పూజలు | - | 6,500/- |
| VIP దర్శనం | - | 1,50,000/- |
| ప్రచారశాఖ | - | 8,200/- |
| పాతగుట్ట | - | 13,830/- |
| కొండపైకి వాహన ప్రవేశం | - | 2,49,000/- |
| యాదఋషి నిలయం | - | 67,900/- |
| సువర్ణ పుష్పార్చన | - | 59,600/- |
| శివాలయం | - | 17,500/- |
| శాశ్వత పూజలు | - | 10,000/- |
| పుష్కరణి | - | 500/- |
| ప్రసాదవిక్రయం | - | 7,75,470/- |
| లాకర్స్ | - | 380/- |
| అన్నదానం | - | 24,848/- |
| విమాన గోపురం | - | Nill |
| లీజెస్ | - | 20,000/- |
| ఇతరములు | - | Nill |






## నేడు పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

**మోత్కూరు, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇవాళ పదవ తరగతి పరుగు పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు, అదేవిధంగా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బూజిలాపురం గ్రామానికి చెందిన మరో విద్యార్థికి హైదరాబాద్ చెందిన ప్రముఖ డాక్టర్ రామారావు 5016 నగదు ప్రోత్సాహక బహుమతులు ఈనెల 21న అందజేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీపి రెడ్డి గోపాల్ రెడ్డి శుక్రవారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు ఎమ్మెల్యే మోత్కూరు రాక

**మోత్కూరు, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** ఈనెల 21న మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖద్వారా ప్రారంభోత్సవానికి స్థానిక శాసన సభ్యులు మందుల సామేల్. రానున్నట్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్ శుక్రవారం నాడు విడుదలచేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ,, అనుబంధ నాయకులు ప్రజా ప్రతినిధులు సకాలంలో పాల్గొనాలని కోరారు.



## ప్లాంట్స్ గివింగ్ డే సందర్భంగా మొక్కల పంపిణీ

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ అధ్వర్యంలో ఈ రోజు ప్లాంట్స్ గివింగ్ డే సందర్భంగా విద్యార్థులకి ఫలాలు, నీడ ఇచ్చే మొక్కలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంపిడిఓ డి. జితేందర్ రెడ్డి, మండల విద్యాధికారి & పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకోజు భాస్కర్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.స్వామి రాజ్ సమక్షంలో



జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల గణేష్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకి ఎంపిడిఓ, విద్యాధికారి, తదితరులు చేతుల మీదుగా మొక్కల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సూపరిండెంట్ నిరంజన్ అలీ, ఉపాధి హామీ ఏపిఓ పరుష రాములు, ఇంజనీర్ బి.విక్రమ్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, లీగల్ సెల్ కానుగంటి శ్రీశైలం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ఆత్మకూరు (ఎం), జూన్ 20 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రానికి చెందిన పరకాల రమేశ్ తండ్రి లింగయ్య, మాద నర్సయ్య, ఎండీ జానీమియా, కోరే శివలింగం తండ్రి అయ్యాలలకు సీఎం



సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ఆలేరులోని వైఎస్ఎన్ గార్డెన్సులో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు,తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం,నాయకులు కందడి అనంతరెడ్డి, కట్టేకొల హన్మంత్ గౌడ్,మర్యాల వెంకటేశ్వర్లు,తండా శ్రీశైలం,భాషబోయిన పాపయ్య, ఎద్దు వెంకన్న, దొంతరబోయిన భాస్కర్,రంగ పరుశరాములు గౌడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మంగ శ్రీనివాస్

**ఆత్మకూరు(ఎం), జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం ప్రముఖ వ్యాపార వేత్త బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగ శ్రీనివాస్ ఈ సందర్భంగా మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆత్మకూరు మండల ప్రజలు ఆపదలో




ఉన్నవారికి ఆర్థిక సహాయం అందజేస్తూ నిరుపేదలకు చిరు వ్యాపార సముదాయాలు కల్పిస్తూ పేదింటి ఆడబిడ్డ పెళ్ళిలకు అండగా ఉంటున్నందుకు వారికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులను ఆకర్షించేందుకు పెయింటింగ్

### ప్రభుత్వ పాఠశాల గోడలకు పాఠశాల యూనిఫాం ఊహ చిత్రాల బొమ్మలతో ఆకర్షణీయంగా నిలుస్తున్న మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ...

### రోజురోజుకు పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

### హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు.




**మోత్కూరు, జూన్ 20 ( వార్త వేదిక సూర్య):**
ప్రభుత్వ పాఠశాల లను బలోపతానికి చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో జూన్ 12 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట నిర్వహించారు. ఈ దశలో మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పట్టణంలోని విస్తృతంగా అన్ని ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి విద్యార్థి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ముమ్మర ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చదివిస్తే పుస్తకాలు నోట్ బుక్స్, ఇటీవల జరిగిన పదో తరగతి ఫలితాలను వివరించడంతోపాటు పదవ తరగతి అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు డి.ఆర్. డి. ఏ. సీట్లు లభిస్తాయని, తద్వారా కార్పొరేట్ కళాశాల స్థాయిలో చేరే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ ఏడాది తమ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసి అత్యధిక మార్పు సాధించిన ఆరుగురు విద్యార్థులకు డి.ఆర్.. డి. ఏ. సీట్లు సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీపి రెడ్డి గోపాల్ రెడ్డి శుక్రవారం నాడు వార్తా వేదిక సూర్య ప్రతినిధి తో మాట్లాడుతూ తెలిపారు. బడిబాట ముమ్మరం గా నిర్వహించడం ద్వారా పాఠశాల ప్రారంభమై వారం రోజులలోనే తమ పాఠశాలలో దాదాపు 150 మంది విద్యార్థులు చేరారని చెప్పారు. తమ పాఠశాల లో ప్రహరీ గోడలకు రంగులు వేయించి పాఠశాల యూనిఫామ్ తో బాలుర, బాలికల ఊహ చిత్రాలను గీసి పలువురిని ఆకట్టుకునేలా చేసిందని స్థానికులు ప్రధానోపాధ్యాయులు పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి

### బిసిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గోధా శ్రీరాములు డిమాండ్

**మోత్కూరు, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.) జిల్లా ప్రధాన కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు . శుక్రవారం నాడు మోత్కూరు సిపిఐ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో నల్లధనాన్ని వెలికి తీసి పేదలకు ఒక్కొక్కరికి 15 లక్షల రూపాయలు అకౌంట్లో వేస్తానని ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయకపోవడం ప్రధాని మోడీ వైఖరి ఏంటో తేటతెల్లమైందన్నారు .భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాల పార్టీ అని స్వాతంత్ర ఉద్యమంలో ఉద్యమం నడపటంతో పాటు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపిన చరిత్ర గల పార్టీ అన్నారు. ఈ స్వాతంత్ర తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 అమరవీరులయ్యారని, పేదల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐ నేనని తెలిపారు అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అనేక ఎన్నికల వాగ్దానాలు ఇచ్చి ఇప్పటివరకు మాత్రం ఒకటి ,రెండు వాగ్దానాలు మాత్రమే అమలు చేశారని మిగతా వాగ్దానాలు కూడా అమలు చేయాలని లేనియెడల ప్రజలను సమీకరించి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.




ఈ మహాసభకు ముందు మండల సిపిఐ సీనియర్ నాయకులు తాడూరి లక్ష్మీ నర్సయ్య సిపిఐ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి ,బోలగాని సత్యనారాయణ రాష్ట్ర చేనేత కార్మిక సంఘం కార్యదర్శి పాసికంటి లక్ష్మీ నర్సయ్య జిల్లా కార్యవర్గసభ్యులు చేడేచంద్రయ్య బోడ సుదర్శన్, ఉప్పల ముత్యాలు, కళ్లెం కృష్ణ , బండి జంగమ్మ సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ గీత పనివారాల సంఘం జిల్లా అధ్యక్షులు చాపలఅంజయ్య బుషిపాక నర్సింహ్మా మొగుళ్ల శేఖర్ రెడ్డి, జిట్ట రాములు ,బోయిని ఉప్పలయ్య, తొంట తిరుపతయ్య ,దొండ రాములు చేతరాశి సత్తయ్య, ఎండి అబ్బాస్ అలీ, వల్లపు అంతయ్య ,దొండఎల్లయ్య ,ఎర్ర బాబు, కొమ్ము రాములు ,గొలుసుల యాదగిరి, పోచం కన్నయ్య ,బోడ సోనర్సయ్య, పెండెం వెంకటేశ్వర్లు కడమంచి వీరస్వామి, ఎడ్ల ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# ముషిపట్లలో దొంగ మహిళల ముఠా

### గ్రామస్తుల చేతికి చిక్కిన ముఠా సభ్యులు పోలీసులకు అప్పగింత

**మోత్కూరు, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
మోత్కూరు మండలంలోని ముషిపట్ల గ్రామంలో దొంగతనానికి రెక్కీ నిర్వహిస్తున్న నలుగురు అనుమానస్పద మహిళలను గ్రామస్తులు చాలాచక్యంగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. స్థానికులు పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం శుక్రవారం నాడు మధ్యాహ్నం సమయంలో నలుగురు మహిళలు గ్రామంలో హనుమస్పదంగా తిరుగుతూ కనిపించారు. వీరి ప్రవర్తన అనుమానం కలిగిన గ్రామస్తులు వారిని మీది ఏ గ్రామం... ఎందుకు ఇక్కడికి వచ్చారంటూ ప్రశ్నించడంతో సరైన సమాధానం రాలేదని తద్వారా వారిని గ్రామస్తులంతా ఒక్కటై పట్టుకునే విధంగా ప్రయత్నించగా ఒక దశలో వారు తప్పించుకునే విధంగా ప్రయత్నించగా వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో వరంగల్ జిల్లా హన్మకొండ, కాజీపేట, మణికొండ, మైసమ్మ, స్వాతి, శారద, సునీతగా గుర్తించారు. వీరిని తహాశీల్దార్ ఎదుట బైండోవర్ ఎదుట హాజరు పరిచి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పి.ఎస్సై నోయేల్ రాజు తెలిపారు.



# దాతల కృషి అభినందనీయం

### - డిఇఓ సత్యనారాయణ

**రామన్నపేట, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు కృషి చేయడం అభినందనీయమని యాదాద్రి భువనగిరి జిల్లా డీఈఓ కే సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రామన్నపేట మండలం బోగారం పాఠశాలలో చదివే విద్యార్థులకు దాతలు హ్యాండ్ రైటింగ్ నోట్ బుక్స్, నోట్ బుక్స్ మరియు ఒకటీ నుండి ఏడు తరగతులలో మొదటి, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బోగారం పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు హాజరై బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు పాఠశాల కు అవసరమైన కనీస వసతులు కల్పించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఒకటవ తరగతిలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం




చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రతినోపధ్యాయులు ముసుకు వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఎంఈఓ జి జ్యోతి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కే శేఖర్ దాతలు కునూరు సాయికుమార్ గౌడ్ కునూరు మల్లేశం గౌడ్, ఊటుకూరి మంజుల, గండ్ల మమత, చింతల వెంకటేష్, ఏఏపీసీ చైర్మన్ అంతటి ధనమ్మ విద్యరాణి, శ్రీలత, కే శేఖర్, కే సదానందం, గ్రామస్తులు, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి నిరంతరం కృషి..

### ప్రధానోపాధ్యాయులు తీపిరెడ్డి గోపాల్ రెడ్డి

**మోత్కూరు,జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాను వచ్చి రెండు సంవత్సరాల్లోనే పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి ద్యేయంగా అధికారుల ప్రజా ప్రతినిధులు , ఉపాధ్యాయులు , పూర్వ విద్యార్థుల సహకారంతో కృషి చేస్తున్నాను. ఇప్పటికే పాఠశాలలో సీసీ కెమెరా, విద్యార్థులకు భోజనం వసతి డైనింగ్ హాల్ ఏర్పాటు చేశానని , పాఠశాలము ముందు బాగాన గేటు, ఏర్పాటు చేయడంతో పాటు ప్రహారి గోడలపై విద్యార్థుల పాఠశాలకు వెళ్తున్న ఊహ చిత్రాల బొమ్మలను పెయింటింగ్ వేయించాను. దీంతో విద్యార్థులు పాఠశాల పాఠశాలకు ఎక్కువ సంఖ్యలో చేరుతున్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపాతానికి లక్ష్యంగా ముందుకు సాగుతున్నా.

## నేడు ఎస్సీ ఎస్టీ సమస్యలపై జిల్లా కేంద్రంలో రివ్యూ సమావేశం...

**మోత్కూరు, జూన్ 20 (వార్త వేదిక సూర్య):**
ఈనెల 21న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ ఎస్టీల రివ్యూ సమావేశం ఉదయం 11 గంటలకు ఉన్నతాధికారులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మనిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్ శుక్రవారం నాడు ఒక ప్రకటన తెలిపారు.

ఈ సమావేశానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ బక్కి వెంకటయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని చెప్పారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ దరఖాస్తుల ద్వారా తెలియ పరచవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ ఎస్టీలు ప్రజలు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.






# జూన్ 24న నకరేకల్‌లో జరిగే వ్య.కా.స డివిజన్ వర్క్ షాప్‌ను జయప్రదం చేయండి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి**

**చిట్యాల రూరల్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** జూన్ 24న నకిరేకల్ లో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నకిరేకల్ డివిజన్ వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున చిట్యాల లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చిట్యాల మండల కమిటీ సమావేశం సంఘం మండల అధ్యక్షులు కల్లూరు కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని అందులో భాగంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించి కూలీలకు 200 రోజులు పనులు కల్పించి 600 రూపాయల వేతనం ఇవ్వాలని ఉపాధి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని భవిష్యత్తు ఉద్యమాన్ని



రూపొందించుకోవడం కోసం ఈ వర్క్ షాప్ ను నిర్వహిస్తున్నామని ఈ వర్క్ షాప్ కు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య గారు, జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు గార్లు హాజరవుతున్నారని కావున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు గుడిసె లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు కల్లూరి కుమారస్వామి, ఉపాధ్యక్షులు నకిరేకంటి రాములు, సహాయ కార్యదర్శి కోనేటి రాములు, రెడపాక మల్లయ్య,యాదయ్య, నరసింహ, ఇస్తారీ, శంకరయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# బుక్ స్టాల్స్ నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ లు,టై బెల్ట్ అమ్మకాలు ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**

**బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**

**దేవరకొండ, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** బుక్ స్టాల్స్ నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్ లు,టై బెల్ట్ లు అమ్ముతూ పేద విద్యార్థులను దోచుకుంటున్నారని ఆరోపించారు.అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని ఆయన కోరారు ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని ఆయన కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్, పొట్ట మధు,జామీర్ బాబా,పేట అభి,అంజి, వెంకటేష్ , మహేష్,రవి,తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ డే వేడుకలు

**దేవరకొండ, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** ఘనంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవరకొండ శాఖ నందు శుక్రవారం రోజు యూనియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ ఓ బి సి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వి టి , సీ ఎం ఫణిదర్ కామ్రేడ్స్‌తో కలిసి యూనియన్ ఫ్లాగ్ ఆవిష్కరించి, వై తారక్ నాథ్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. అనంతరం స్కూలు విద్యార్థులకు 80 మందికి స్కూల్ బ్యాగులు పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా ఎన్ వి టి మాట్లాడుతూ ఎంతోమంది యూనియన్ నాయకుల త్యాగ ఫలమే ఈరోజు మనము మన హక్కులని సాధించుకుంటున్నామని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ ఉన్నత స్థాయికి చేర్చిన మహా నాయకుడు చిరస్మరణీయుడు




యూనియన్ ఒక బుక్ ఆఫ్ ఇన్స్ట్రక్షన్స్ ఏర్పాటు చేసిన అమరజీవి అన్న తారక్ నాథ్ అన్న గారికి ఇవే మా నివాళులు. నేటి తరం నాయకులు వాటినీ అనుసరిస్తే చాలు మన యూనియన్ ఎప్పుడు ఉన్నత స్థాయిలో ఉంటుంది ముందుకు వెళుతుంది అని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ పాండు




నాయక్, ఎన్ వెంకటరామ్, చరణ్, శ్రీనివాస్, గోపాలకృష్ణ, శాంతా నాయక్, సాయి కిషోర్, శ్రీనయ్య ,వెంకన్న, మనిషా, స్వాతి, నీరజ, ఖాజా, వెంకట్ ,పవన్ నాయుడు, జయప్రకాష్, సాయి, అనుదీప్, బాలస్వామి, కుమార్, సురేష్, చంద్రబాబు, కె వి ఎం వెంకట్, కోటేశ్వరరావు, చక్రపాణి, శ్రీకాంత్, రాజకుమార్, కలమ్మ, ప్రవీణ్, దేవరకొండ, చింతపల్లి, మల్లెపల్లి, నాంపల్లి, గుడిపల్లి, చెరుకుపల్లి ,పులిచెర్ల శాఖల కామ్రేడ్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బాలికలకు విద్యార్థులకు అవగాహన సదస్సు

**దేవరకొండ, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** నల్లగొండ జిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో కిశోర బాలిక సాధికారత అనే అంశంపై కిశోర బాలికలకు అవగాహన ఉమెన్ ఎంపవర్మెంట్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ఆర్ నాగేశ్వరరావు గారు రావడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ శ్రీమతి మల్లీశ్వరి ఉపాధ్యాయులు జి అనురాధ పద్మప్రియ,శోభ రాణి మరియు ఎం.ఎల్.హెచ్.పి సువర్ణ



,అనూష డి . డబ్ల్యూ .ఓ వి .జ్యోతి ఈ కార్యక్రమంలో పాల్గొని బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలికలు శారీరకంగా ,మానసికంగా, సామాజిక వికాసాభివృద్ధిని సాధించడం గురించి వివరించడం జరిగింది.

# నమ్మిన ప్రజల కోసం పల్లెబాట పట్టిన పాల్వాయి డా.వెంకట్ రెడ్డి

**దేవరకొండ, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం పీఏపల్లి మండలంలో శుక్రవారం రోజున మల్లాపురం గ్రామపంచాయతీలో స్థానిక కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి బొడ్డుపల్లి సత్తయ్య తో కలిసి మల్లాపురం గ్రామంలో పర్యటించిన సూర్య హాస్పిటల్ అధినేత పేద ప్రజల ఆరోగ్య సంరక్షకులు డాక్టర్ వెంకట్ రెడ్డి పాల్వాయి స్థానికంగా ఉన్నటువంటి యువకులు ప్రజలతో మమేకమవుతూ గ్రామంలో పర్యటిస్తూ కాలనీలో ఉన్నటువంటి సమస్యలను తెలుసుకుంటూ అక్కడి వాళ్లకు ఉన్నటువంటి ఆరోగ్య సమస్యలకు సరైన సలహాలు సూచనలు ఇస్తు, మండలంలో ప్రతి ఒక్క పేదవాడికి ఆరోగ్య సమస్యలు ఉంటే నలగొండ సూర్య హాస్పిటల్ కు వచ్చి ఉచితంగా నాణ్యమైన వైద్యం పొందగలరని,విన్నవిస్తు గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ గారి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా తన వంతు ప్రయత్నిస్తానని ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరు ప్రతి పథకానికి దరఖాస్తు చేసుకొని అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ఇందిరమ్మ రాజ్యంలో మంచి జరుగుతుందని దేవరకొండ నియోజకవర్గం లో ప్రతి ఒక్క కష్టపడ్డ కార్యకర్తకు ఎమ్మెల్యే మేము మండల పార్టీ నాయకులంతా అండదండగా ఉంటామని స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గం లో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గారి ఆధ్వర్యంలో క్లీన్ స్వీప్, చేయబోతుందని ఈ



సందర్భంగా వారు అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ నాయకులు పెద్దలు దేశిడి జైపాల్ రెడ్డి, బొడ్డుపల్లి సత్తయ్య, పీఏపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్,నేతల సైదయ్య, మారం శ్రీనివాసులు, ఆకనబోయిన మధు,మస్తాన్ గౌడ్, ఆంజనేయులు, శ్రీనివాసులు, వంగాల శ్రీనివాస్ రెడ్డి, గుండబోయిన నగేష్ ముదిరాజ్, అజయ్, ముత్యాలు, కుమార్, నరసింహ, మేగావత్ రాజు నాయక్, మరియు స్థానిక గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# తిప్పర్తి ఎస్సైగా వి.శంకర్ బాధ్యతల స్వీకరణ

**నల్లగొండ,జూన్ 20 (వార్త వేదిక సూర్య):** తిప్పర్తి మండల నూతన ఎస్ హెచ్ ఓ(ఎస్సై) గా శుక్రవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో వి.శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన సాయి ప్రశాంత్ హాలియా కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఎస్సైగా శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ ను అరికట్టడంతో పాటు గవర్నమెంట్ పథకం ద్వారా అందించే పిడిఎస్ రైస్ పక్కదారి పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిప్పర్తి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు ప్రజలు సహకరించి మండలాన్ని శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచేందుకు సహకరించాలని సూచించారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు అక్రమ చర్యలకు పాల్పడే వారుంటే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచిం చారు. మండల ప్రజలు నేరుగా తనను కలిసి వారి సమస్యలను తెలియజేయవచ్చని అన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలి

**మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం పాఠశాలల సర్వే**

**నల్లగొండ,జూన్ 20 (వార్త వేదిక సూర్య):** ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వ విద్యను బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధులు కేటాయించాలని, సిపిఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేశరాజు పల్లి, డైట్ పాఠశాల, దేవరకొండ రోడ్డు బాలుర, రాష్ట్రపతి రోడ్డు బాలికల, బొట్టుగూడ, జేబిఎస్, మాల్ బౌలి పాఠశాలలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన తర్వాత పథకాల పేరు మార్చి నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్స్ వంటశాలలు ఇతర మౌలిక సదుపాయాలు మద్యంతరంగా ఆగిపోయినాయని అన్నారు.

గత ప్రభుత్వం మన ఊరు మనబడి పథకం ద్వారా కేశరాజు పల్లి పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం ప్రారంభించి మద్యంతరంగా ఆపివేయడం జరిగిందని అన్నారు. డైట్ పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థులు ఉండగా అటెండర్లు గాని జూనియర్ అసిస్టెంట్ కంప్యూటర్ ఫ్యాకల్టీస్ ఎలాంటి బోధ నేతర సిబ్బంది లేకపోవడం ద్వారా విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్ సైకిల్ షెడ్ నిర్మాణం చేయాలని దేవరకొండ రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ తెలుగు పండిట్ ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్నాయని తక్షణం అక్కడ డిప్యూటేషన్ పద్ధతి ద్వారానైనా నియమించాలని కోరారు అకాడమిక్ సంవత్సరం ప్రారంభానికి





ముందే పాఠశాలలో కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వివరించాయని అన్నారు దేవరకొండోడు బాలల పాఠశాలకి అదునంగా నాలుగు తరగతి గదులు నిర్మించాలని ఉన్నత పాఠశాలకుల ప్రధానమైనటువంటి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఖాళీ పోస్టు ఉండడం దురదృష్టకరమని వెంటనే గెజిటెడ్ ఉపాధ్యాయుని నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి రోడ్డు బాలికల పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఉన్నప్పటికీ ఎలాంటి పరికరాలు లేవని అన్నారు. ఉన్నత పాఠశాలల స్థాయిలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫ్యాకల్టీలు నియమించాలని నైట్ వాచ్మెన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు పేద మధ్యతరగతి విద్యార్థులు వస్తున్న ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు వారానికి మూడు కోడిగుడ్లు అందిస్తున్నారని మధ్యాహ్న భోజనం కార్మికులకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని వారికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం విద్యార్థులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, కోట్ల అశోక్ రెడ్డి, గుండాల నరేష్, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన తండా గ్రామాలు ఆర్థిక అభివృద్ధిని సాధించాలి

**సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.**

**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ దేబోజిత్ బార**

**- కంచల్ తండాలో పీఎం డిఎ జెజియుఏ గ్రామ సభ.**

**బొమ్మలరామారం, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** గిరిజన తండా గ్రామాల ప్రజలు మెరుగైన కుటుంబ ఆర్థిక ప్రణాళిక ద్వారా తండా సమగ్ర అభివృద్ధిని సాధించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ దేబోజిత్ బారా అన్నారు. శుక్రవారం మండలంలోని కంచల తండాలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు,భగవాన్ బిర్సా ముండా జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జన జాతీ గౌరవ టేలో దర్తి ఆభా జన బాగీదారి అభియాన్ , గిరిజన గ్రామాల అభివృద్ధి, ఎస్ ఎస్ టి సి ఎఫ్ ఎల్ ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన గ్రామ సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకులను సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థిక ప్రణాళిక ద్వారా పొదుపు చేయడం అలవాటు చేసుకుంటే భవిష్యత్ అవసరాలు తీర్చుకొని, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. కుటుంబానికి సంబంధించిన ఆర్థిక ప్రణాళిక తయారు చేసుకోవడం, పొదుపు లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన బ్యాంకుల్లోనే దాచుకోవాలని, ఆర్థిక క్రమశిక్షణతో క్రెడిట్ స్కోర్ పెంచుకోవాలన్నారు. రుణాలను బ్యాంకుల్లోనే తక్కువ వడ్డీకే పొందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా, జీవన్ జ్యోతి, సుకన్య సమృద్ధి యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశ ఆర్థిక అభివృద్ధిలో గిరిజన గ్రామాలు కీలక పాత్ర పోషించి ఆర్థికంగా




ఎదగాలన్నారు. సైబర్ మోసాల ద్వారా ఖాతాదారులు ఎక్కువగా నష్టపోతున్నారని సైబర్ మోసగాళ్ల వలలో పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వారు వివరించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండలన్నారు. ప్రతి గిరిజన తండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను సద్వినియోగం చేసుకొని గిరిజన సంక్షేమ దార్శనికత నుండి లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. బ్యాంకుల అందించే సేవల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన శాఖ అధికారి భాస్కర్, మండల ప్రత్యేక అధికారి మంజునాథ్ , లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివరామకృష్ణ, మండల పంచాయతీ అధికారి శ్రీమాలిని, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, ఎస్ ఎస్ టి సి ఎఫ్ ఎల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కోఆర్డినేటర్ ఎల్లబోయిన విశ్వనాథ్, తుర్కపల్లి కోఆర్డినేటర్ నాగరాజ్, కౌన్సిలర్లు ఉమా,భాను , నాయకులు వాలు నాయక్ రమేష్ నాయక్ , అంగన్వాడీ ,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## తలసేమియా బాధితులకు ఉచిత వైద్యం

### ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన బ్రోచర్ ఆవిష్కరణ

**హైదరాబాద్,జూన్ 20 (వార్త వేదిక సూర్య):** 11వ అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకొని సంతోష్ నగర్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శారీరక దారుఢ్యం, మానసిక ఒత్తిడిని అధిగమించడం కోసం యోగ ఆసనాల పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా యోగా మాస్టర్ ప్రొఫెసర్ జయరామ్ రెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల








మానసికంగా ఆరోగ్యంగా ఎదగటం వల్ల విద్యార్థులలో జ్ఞాపకశక్తి ఏకాగ్రత చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలియజేశారు. అనంతరం కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్ వారు తలసేమియా పిల్లల కోసం ప్రత్యేక వార్డును కేటాయించి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని కామినేని హాస్పిటల్ పీఆర్వో బి యాదగిరి తెలియజేస్తూ అందుకు సంబంధించిన వివరాలతో కూడిన బ్రోచర్ల ను ఆవిష్కరించడం జరిగింది. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత, తలసేమియా బాధితులు బ్రోచర్ లో ఉన్న ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి పనిదినములలో ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంటలకు సంప్రదించవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పర్యావరణమిత్ర, సేవారత్న, కరోనా వారియర్, ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ గ్రహీత డాక్టర్ టి సురేందర్, సామాజిక సేవా కార్యకర్త గౌని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


## చౌటుప్పల్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి : లింగస్వామి మాదిగ

**చౌటుప్పల్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** చౌటుప్పల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల ప్రాంత పరిధిలో గత 30 సంవత్సరాలుగా డిగ్రీ కాలేజీ లేక ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల అగ్రవర్ణ పేద ప్రజలు విద్యకు దూరమవుతూ ఇబ్బందులకు గురవుతున్నారని, గతపాలకులు ఈ ప్రాంత అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గురించి పట్టించుకోకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ఈ ప్రాంతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, లేనియెడల భవిష్యత్తులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని లింగస్వామి మాదిగ పేర్కొన్నారు.

## చౌటుప్పల్ మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో చిలుకల శ్రీనివాస్ యాదవ్‌కు ఘన సన్మానం

**చౌటుప్పల్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన చిలకల శ్రీనివాస్ యాదవ్ ను మరియు యాదాద్రి భువనగిరి జిల్లా అఖిలభారత యాదవ మహాసభ జిల్లా డైరెక్టర్ గా ఎన్నికైన నల్ల గణేష్ యాదవ్ లకు చౌటుప్పల్ అఖిలభారత యాదవ సంఘం చౌటుప్పల్ మండల కమిటీ అధ్యక్షులు చినుకని మల్లేష్ యాదవ్ నేతృత్వంలో శాలువాలతో పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో యాదవ





సంఘం గౌరవ సలహాదారులు నల్ల పార్వతాలు యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి గంగనబోయిన వెంకటేష్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు ఎరసాని సతీష్ యాదవ్, మల్లికార్జున దేవస్థానం అధ్యక్షులు ఆవుల యేసు యాదవ్, ప్రధాన కార్యదర్శి మార్గం నరసింహ యాదవ్, ఉపాధ్యక్షుడు గుణమోని లింగస్వామి యాదవ్, నాయకులు ఎర్రగొని మల్లేష్ యాదవ్, గజ్జి పాండు యాదవ్, మెండే మల్లేష్ యాదవ్, ఎర్రసాని శేఖర్ యాదవ్, మార్గం వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొని సన్మానించారు.

## బార్ కౌన్సిల్ మెంబర్గా బరిలో ఉన్న న్యాయవాది నర్రి స్వామిని సన్మానించిన చౌటుప్పల్ కోర్ట్ అధ్యక్షుడు బాల్య వెంకటాచలం బార్ అసోసియేషన్ సభ్యులు

**చౌటుప్పల్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బరిలో ఉండే న్యాయవాది తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ ఫోరం ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అఖిల భారతీయ న్యాయవాద సంయుక్త సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి కుర్మని చౌటుప్పల్ బార అసోసియేషన్ అధ్యక్షుడు బాల్య వెంకటాచలం మరియు బార్ అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి మెమొంటోతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా చౌటుప్పల్ కోర్టు అసోసియేషన్ అధ్యక్షులు బాల్య వెంకటాచలం మాట్లాడుతూ నర్రి స్వామి రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే సామాజిక న్యాయం కోసం ఉద్యమిస్తున్న సామాజిక చైతన్యం ఉన్న రాజకీయ చైతన్యం కలిగిన న్యాయవాది చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లో ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా మరియు లైబ్రరీ సెక్రటరీగా గెలుపొంది తన వంతు సేవలను అందించాడు కాబట్టి మా అసోసియేషన్ న్యాయవాదుల జనరల్ బాడీ మీటింగ్లు అనంతరం నర్రి స్వామిని గౌరవంగా సన్మానించడం జరిగిందన్నరూ వారి బార్ కౌన్సిల్ మెంబర్ గా బరిలో ఉంటే చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఉంచి మద్దతు తెలియజేస్తునన్నము అన్నారు ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మహిపాల్ రెడ్డి, ట్రెజరర్ రమేష్ జాయింట్ సెక్రెటరీ స్వాతి, శేఖర్, శ్రీశైలం యాదవ్, కార్యవర్గ సభ్యులు కయుంపాషా, శివ కుమార్ ,మాజీ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్ , నరసింహారెడ్డి మాజీ



ఉపాధ్యక్షుడు తాడూరి పరమేష్, మాజీ జనరల్ సెక్రెటరీ పాల పరమేష్ సీనియర్ న్యాయవాదులు రాధాకిషన్ రావు, తడక మోహన్ సత్తిరెడ్డి, వెంకటయ్య, శ్రీకాంత్, శ్రీశైలం అనేకమంది న్యాయవాదులు పాల్గొన్నారు

## ఆయిల్ ఫామ్ లాభసాటి పంట,ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తుంది

### రైతులు ఉపయోగించుకోవాలి : ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు కవిత, నాగరాజు

**చౌటుప్పల్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను ఉపయోగించుకొని రైతులు ఆయిల్ ఫామ్ పంటను సాగు చేసి అధిక లాభాలను గడించాలని ఉద్యానవన శాఖ అధికారి కే కవిత, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు లు తెలిపారు. చౌటుప్పల్ మండలంలోని నక్కలగూడెం గ్రామంలో రైతు వాకిటి యుగేందర్ రెడ్డి తోటలో శుక్రవారం రైతులందరితో కలిసి ఆయిల్ పామ్ పంట పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కవిత, నాగరాజు లు మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట అవశ్యకత, వాటి లాభాలు, గవర్నమెంట్ నుండి వచ్చే సబ్సిడీలు, తోటల యాజమాన్య పద్ధతులు ఎరువుల వాడకం, నీటి యాజమాన్యం, కొమ్మల కత్తిరింపులు అంతర పంటలు, అంతరకృషి చర్యలు, పుష్పాలను తొలగించడం, అబలేషన్ ప్రాక్టీసెస్ గురించి క్లుప్తంగా రైతులకు వివరించారు.

యాజమాన్య పద్ధతులను క్రమానుసారంగా పాటిస్తే నాణ్యమైన, అత్యధిక పంట దిగుబడులను సాధించవచ్చునని తెలిపారు. ఆయిల్ పామ్ పంటను ప్రస్తుతం వాణిజ్య పంటగా సాగు చేయడం జరుగుతుందని, పంట వేసిన 4వ సంవత్సరం నుండి ఆయిల్ పామ్ లో పంట చేతికి అంది వస్తుందని, ఈ పంట సాగులో మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటగా పెసర, పత్తి, మిర్చి, బొప్పాయి, వేరుశనగ వంటి పంటలను సాగు చేసుకుని రైతు ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ పంట సాగుతో రైతుకు ఎకరాకు 1.5 నుండి 2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నందున ఈ పంటను సాగు చేయడం ఎంతో లాభదాయకం. ఈ పంట సాగులో చీడపీడల సమస్య, కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాల




సమస్య ఉండదు. దళారీ వ్యవస్థ కూడా ఉండదు. ఎకరాకు 57 మొక్కల చొప్పున రాయితీపై 20 రూపాయలకే రైతుకు అందజేయడం జరుగును. డ్రిప్పు పైపులకు కూడా రాయితీలు అందించబడును. ఎస్సి ఎస్టిలకు 100శాతం, బీసీలకు 90శాతం, ఓసీలకు 80 శాతం రాయితీతో డ్రిప్పు పైపులు సరఫరా చేయబడును. తోట నిర్వహణ, యాజమాన్య ఖర్చుల కొరకు, అంతర పంట సాగు కొరకు ప్రభుత్వం నుండి రైతుకు నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి సంవత్సరానికి రూ. 4,200 లు చొప్పున రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కవిత, నాగరాజు లు తెలిపారు.కార్యక్రమంలో డీసీవో ప్రవీణ్, పీఎంఓ శ్రీరామ్, ఫీల్డ్ ఆఫీసర్ హరీష్, రైతులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో అడిషనల్ కోర్టు, సబ్ కోర్టులను ఏర్పాటు చేయాలి

### - బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటాచలపతి

**చౌటుప్పల్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** చౌటుప్పల్‌లో అడిషనల్ కోర్టును, సబ్ కోర్టులను ఏర్పాటు చేయాలని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలపతి కోరారు.

బార్ అసోసియేషన్ విస్తృతస్థాయి సమావేశం చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకటాచలపతి అధ్యక్షతన బార్ అసోసియేషన్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ద

ఈ సందర్భంగా పాలు తీర్మానాలు చేసి ఆమోదించారు. చౌటుప్పల్‌లో అదనపు న్యాయస్థానాన్ని, సబ్ కోర్టును, కోర్టు నూతన భవన సముదాయ నిర్మాణానికి సంబంధిత హైకోర్టు న్యాయ మూర్తులను కలిసి విజ్ఞప్తి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు, బార్ అసోసియేషన్ ఆదాయ, వ్యయాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అదేవిధంగా స్థానిక శాసనసభ్యులు, న్యాయశాఖ మంత్రి గతంలో ఇచ్చిన వినతి పత్రాలపై పునర్ సమీక్ష చేసి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం, కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి, అదనపు కోర్టుల మంజూరీ కోసం విస్తృతంగా ప్రయత్నం చేయాలని, బార్ అసోసియేషన్ హాల్లో మౌలిక వసతుల




ఏర్పాటు కొరకు విస్తృతంగా చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ స్వాతి, కోశాధికారి జెల్ల రమేష్, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి జెక్కర్తి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి దేశగోని శ్రీశైలం, కార్యవర్గ సభ్యులు పిల్లలమర్రి కిరణ్, ఎండి ఖయ్యూం పాషా, మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఊడుగు శ్రీనివాస్, తాడూరి పరమేష్, సీనియర్ న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, కానుగు వెంకటయ్య, రాధా కిషన్ రావు, వాకిటి నరసింహారెడ్డి, పాల పరమేశం, నర్రి స్వామి, జంపాల శ్రీశైలం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాసర్ల నర్సిరెడ్డి ఆశయాలను సాధించాలి

### మార్కెట్ చైర్మన్ వెంకటయ్య, మాజీ చైర్మన్ డాక్టర్ మాధవరెడ్డి

**చౌటుప్పల్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని లక్కారం నీటి సంఘం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసర్ల నర్సిరెడ్డి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మార్కెట్ మాజీ చైర్మన్, రాజీవ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి కోరారు. మున్సిపాలిటీలోని లక్కారం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో పార్టీలకు అతీతంగా పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని కాసర్ల నర్సిరెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం, ప్రధానంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం నర్సిరెడ్డి చేసిన కృషి మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెల్గ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, ఏసీపీ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రవీందర్, నీటి సంఘం మాజీ చైర్మన్ కంచరకుంట్ల వెంకట్ రెడ్డి, ఇన్స్పెక్టర్ మన్మధకుమార్, ఆకాష్ ఫౌండేషన్ చైర్మన్ దుబ్బాక ఆకాష్ రెడ్డి, నాయకులు దుబ్బాక శశిధర్ రెడ్డి, కానుగు బాలరాజు, కంచరకుంట్ల రాంరెడ్డి, గుండెబోయిన వెంకటేష్, కొంతం దామోదర్ రెడ్డి, అనంతరెడ్డి, ముత్యాల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## యోగా




ఉషస్సు లేచి యోగా చేయండి
ఆరోగ్యాన్ని ఆనందంగా పిలవండి.
యోగ ఓ చిన్న పనిముట్టు
ఆరోగ్యాన్ని అందించే ఆయువుపట్టు
రోజుకో గంట యోగ
ఆరోగ్యానికి అది పాగా
మనసును నిగ్రహించు యోగ
బుద్ధిని మెరిపించు బాగా
వంగిన శరీరమే పూల దారి
ఆరోగ్యానికి అది రహదారి
నడుమునకు బలం నయనాలకు తేజం
ఓదార్పు యోగ ఒత్తిడిని జయించు బాగా
పఠనానికి పదును యోగ
క్రీడలకు జవాన్ యోగ
శరీరానికి భరోసా యోగ
మనసుకు మార్గదర్శి యోగ
యోగా చోదక మంత్రం
లోకమునకు శాంతి తరంగం
శరీర బలం యోగ
మనసుకు నిగ్ర హం యోగ
అందుకే రోజు చేద్దాం యోగ
ఆనందంగా ఉందాం చివరిదాకా



**- నన్నూరి రఘుపాల్ రెడ్డి**
స్కూల్ అసిస్టెంట్( తెలుగు)
జడ్.పి.హెచ్.ఎస్ పంతంగి,
చౌటుప్పల్ మండలం.

